'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 30 ‖ ఆదివారం ‖ 13.9.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 30 ‖ Sunday ‖ 13.9.2026 ‖ Pages: 8 ‖ Rate: 2



5లో..

# ఆమె.. అతడా? అంతులేని మర్మం

## సెక్స్ అండ్ స్టాటిస్టిక్స్

**కోరికకు కొలమానం ఎక్కడా?**

**వేల ఏళ్లుగా వెంటాడుతున్న ప్రశ్న**

మగవాడికే కోరిక ఎక్కువా..? ఆడవారిలోనే కామం ఎక్కువగా దాగి ఉందా..? సెక్స్ గురించి ఎక్కువగా ఆలోచించేది ఎవరు..? ఫాంటసీలు ఎక్కువగా ఎవరికి వస్తాయి..? లైంగిక ఆనందం విషయంలో అసలు పైచేయి ఎవరిది..? ఈ ప్రశ్నలకు మనం చెప్పుకునే సమాధానాలు నిజాలా.. లేక తరతరాలుగా వింటూ వచ్చిన అపోహలా..? వేల ఏళ్ల క్రితం రాసిన గ్రంథాలు ఒక మాట చెబితే.. నేటి ఆధునిక శాస్త్రం మరో కోణాన్ని చూపిస్తోంది. లక్షలాది మందిపై జరిగిన పరిశోధనలు బయట పెట్టిన గణాంకాలు ఏం చెబుతున్నాయి..? పురుషుల కోరిక నిజంగానే ఎక్కువా..? మహిళల లైంగిక ఆనందాన్ని సమాజం ఇప్పటివరకు ఎందుకు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయింది..? కోరిక, ఉద్రేకం, భావప్రాప్తి ఇవన్నీ ఒకటేనా..? ఒక మహిళ తన కోరికను బయటకు చెప్పకపోతే.. నిజంగానే ఆమెకు కోరిక తక్కువేనా..? మరోవైపు పురుషుడి కోరికను ఎక్కువగా చూపించే గణాంకాల వెనుక అసలు కారణం ఏమిటి..? కామానికి కొలమానం ఉందా..? కోరికకు లింగం ఉందా..? లేక ప్రతి మనిషి శరీరం ఒక ప్రత్యేక కథనా..? వేల ఏళ్లుగా మనిషిని వెంటాడుతున్న ఈ ప్రశ్నలకు పురాణాలు, చరిత్ర, ఆధునిక శాస్త్రం కలిపి చెబుతున్న సంచలన నిజాలు తెలుసుకోవాలంటే.. ఈ కథనం తప్పక చదవాల్సిందే. అసలు విషయం ఏంటో తెలుసుకోవాల్సిందే!

# బీసీలు బోయిలేనా?

## అధికార పీఠం కలేనా..?

» బడుగు వర్గాలు రాజకీయ పావులేనా..?
» ఈసారైనా అమీతుమీ తేలేనా?
» అధికార పీఠంపై "బీసీ"రియస్
» చిట్టా విప్పుతున్న చిరంజీవులు
» అగ్రవర్ణాల్లో మొదలైంది దిగులు

**56 శాతం బీసీ జనాభా ఉన్న తెలంగాణలో రాజకీయ న్యాయం ఎక్కడ? రాష్ట్రం కోసం మా బిడ్డలు ప్రాణాలు అర్పిస్తే.. అధికారం పంచుకునే వేళ మా బీసీ బిడ్డలు ఎందుకు కనిపించరు? ముదిరాజ్‌లు 26-27 లక్షలు, యాదవులు 25 లక్షలు, గౌడలు 16 లక్షలు, మున్నూరు కాపులు 13 లక్షలకు పైగా, పద్మశాలీలు 13 లక్షలకు పైగా, రజకులు దాదాపు 10 లక్షలు, కుర్మలు లక్షల సంఖ్యలో ఉంటే.. ఇంత జనాభా ఉన్నా రాజకీయ నిర్ణయాధికారం ఎక్కడ? మంత్రి పదవులు ఎక్కడ? ఎమ్మెల్యే సీట్లు ఎక్కడ? ఎమ్మెల్సీ అవకాశాలు ఎక్కడ? నామినేటెడ్ పోస్టులు ఎక్కడ? బడ్జెట్‌లో మా వాటా ఎక్కడ? ఐదుగురు బీసీ మంత్రులతో మొదలైన ప్రాతినిధ్యం నాలుగు.. మూడు.. రెండు అంటూ ఎందుకు కుంచించుకుపోతోంది? ఇదేనా సామాజిక న్యాయం? ఇదేనా తెలంగాణ సాధన ఫలితం? ఖమ్మంలో దశాబ్దాలుగా బీసీలకు ఎందుకు రాజకీయ తలుపులు తెరుచుకోవడం లేదు? ఓటు వేసేటప్పుడు బీసీలు గుర్తొస్తారు.. పదవులు పంచేటప్పుడు ఎందుకు గుర్తురారు? పాలక పక్షానికి ఈ ప్రశ్నలకు సమాధానం ఉందా? ప్రతిపక్షాలు బీసీల తరపున ఎందుకు గట్టిగా నిలబడటం లేదు? జనాభా నిష్పత్తిలో మా వాటా అడిగితే తప్పా? మీ కోటా మాకు ఇవ్వమంటున్నామా? మా హక్కు మాత్రమే అడుగుతున్నాం కదా? బీసీల అస్తిత్వాన్ని గుర్తించని రాజకీయ వ్యవస్థను మేమెందుకు గుర్తించాలి? ఇదే ప్రశ్నను బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు నేతృత్వంలో బీసీ సమాజం ఇప్పుడు పాలకులు, ప్రతిపక్షాల ముందుంచుతోంది.**

7లో..





# మెజారిటీ జనాభా... అధికారంలో మైనారిటీ

- 56% బీసీలు.. రాజకీయ రంగంలో వాటా ఎక్కడ?
- బడుగులు రాజకీయ ప్రాతినిధ్యం.. రౌండ్ టేబుల్ సమావేశం

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో "56% బీసీలు.. రాజకీయ రంగంలో వాటా ఎక్కడ?" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో జరిగిన ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఎన్జీవోలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నాయకుడు తాడూరి శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. (వివరాలు 2లో..)

# వినాయక మండపాలకు ఉచిత కరెంట్

- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ ప్రత్యేక సమీక్ష
- రూపాయి ఖర్చు లేకుండా విద్యుత్ సౌకర్యం



వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఉత్సవాల సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో పోలీస్, మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. పండుగ నిర్వహణలో క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. (వివరాలు 2లో..)



2లో..

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

**సీఎం రేవంత్‌పై సెటైర్లు! • సస్పెన్షన్‌కు నిరసన**

అసెంబ్లీ నుంచి తమ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ శనివారం తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించింది. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం చేపట్టింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్ పాత్ర పోషించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించారు.

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

**హరీశ్‌రావుపై పొంగులేటి ఫైర్**

22ఏ భూముల అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం పనిచేస్తుంటే, అసత్య ప్రచారాలతో తనను, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. (వివరాలు 2లో..)



# పొంగులేటి.. తప్పు ఉంటే చర్యలేవి?

**భూములపై హరీశ్‌రావు ఎదురుదాడి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న భూముల ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. 1995లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేశారని, 2010లో అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమికి ఎన్ఓసీ ఇచ్చిందని హరీశ్‌రావు చెప్పారు. (వివరాలు 2లో..)



# కొండా సురేఖకు ఢిల్లీ పిలుపు!

**అసంతృప్తి చల్లార్చే ప్రయత్నమా?**

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అత్యవసర ఢిల్లీ పిలుపు రావడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి కోల్పోయాక ఢిల్లీకి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందింది. (వివరాలు 2లో..)



# మాక్ అసెంబ్లీకి కూడా రాలేరా?

**కేసీఆర్‌పై సీతక్క ఘాటు విమర్శలు** 2లో..

బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని, ప్రజాస్వామ్యాన్ని అవమానించే కార్యక్రమమని విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం, పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించడాన్ని ప్రశ్నించారు.





# హద్దుల్లో ఉండాల్సిందే

**చైనా అధ్యక్షుడికి మోదీ క్లారిటీ**

**భారత్-చైనా బంధానికి శాంతి కీలకం**

ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీ కీలకంగా మారింది. ఏడు సంవత్సరాల తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, ద్వైపాక్షిక సంబంధాలపై నేతలు విస్తృతంగా చర్చించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత కొనసాగితేనే భారత్-చైనా సంబంధాలు మరింత ముందుకు సాగుతాయని మోదీ స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, పరస్పర అవగాహనలను ఇరుపక్షాలు గౌరవించాలని ఆయన సూచించారు. సరిహద్దు వివాదానికి న్యాయమైన, సహేతుకమైన, ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలు అంగీకరించారు.

# ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్!

**పహల్గామ్ మారణకాండపై తీర్మానం**

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో పహల్గామ్ ఉగ్రదాడి అంశం మరోసారి అంతర్జాతీయ వేదికపై బలంగా ప్రస్తావనకు వచ్చింది. బ్రిక్స్ దేశాల నేతలు 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. బైసరన్ లోయలో జరిగిన ఈ మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. 140 అంశాలతో కూడిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌లోని 40వ అంశంలో ఈ దాడిని ప్రస్తావించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నేరమే, ఎలాంటి కారణం చూపినా సమర్థించలేమని బ్రిక్స్ నేతలు స్పష్టం చేశారు. ఉగ్రవాదుల దాడులు మానవత్వానికి, ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా అభివర్ణించారు.





# అడుగడుగునా నిఘా

**జిన్‌పింగ్‌కి పటిష్ఠ భద్రతా వలయం**

**15 వేల మందితో 24 గంటల పహారా**

ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకరోజు పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం ఢిల్లీ చేరుకున్న జిన్‌పింగ్ సుమారు 24 గంటలు భారత్‌లో ఉండనున్నారు. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ద్వైపాక్షిక భేటీ జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు సహా భారత్-చైనా సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. జిన్‌పింగ్ వెంట ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులు, వ్యాపార ప్రతినిధులతో కూడిన భారీ బృందం వచ్చింది. ఆయన బస చేసే న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్ చుట్టూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. హోటల్ పరిసరాలను నోఫ్లై జోన్‌గా ప్రకటించి, యాంటీ టెర్రర్, బాంబ్ డిటెక్షన్ బృందాలను మోహరించారు.

# శత్రుదుర్భేద్యం జిన్‌పింగ్ విమానం

**ఆకాశంలోనే చైనా అధ్యక్షుడి భద్రతకు కోట**

**బోయింగ్ 747లో మొబైల్ కమాండ్ సెంటర్**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ విదేశీ పర్యటనలకు ఉపయోగించే అధికారిక విమానం సాధారణ విమానం కాదు. ఎయిర్ చైనా నిర్వహించే బోయింగ్ 7478 ఇంటర్‌కాంటినెంటల్‌ను ప్రత్యేకంగా మార్పులు చేసి చైనా అధ్యక్షుడి స్టేట్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా రూపొందించారు. 2014 చివర్లో ఇది వాణిజ్య ప్రయాణికుల విమానంగా సేవలు ప్రారంభించింది. 2015 మేలో వాణిజ్య సేవల నుంచి పూర్తిగా తప్పించి, నెలలపాటు భారీ మార్పులు చేపట్టారు. ప్రత్యేక భద్రతా వ్యవస్థలు, అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, విలాసవంతమైన వీఐపీ అంతర్గత సదుపాయాలు ఏర్పాటు చేశారు.







# బ్రిక్స్ విందులో భారత్ రుచుల సందడి!

**160 మంది కళాకారులతో సాంస్కృతిక వేడుక**

**బ్రిక్స్ నేతలకు భారతీయ ఆతిథ్యం**

బ్రిక్స్ సదస్సు తొలిరోజు కీలక సమావేశాలు, విధాన చర్చలతో బిజీగా సాగిన తర్వాత ఢిల్లీలోని భారత్ మండపంలో బ్రిక్స్ దేశాల అధినేతలు, ప్రముఖ అతిథులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక గాలా డిన్నర్ ఇచ్చారు. భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రపంచ నేతలకు పరిచయం చేసేలా విందును నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేక వంటకాలను మెనూలో చేర్చారు. దక్షిణ భారత రుచుల నుంచి పాత ఢిల్లీ ప్రసిద్ధ వంటకాల వరకు భారతీయ వంటకాల వైవిధ్యం విందులో ఆకట్టుకుంది. ప్రాంతీయ రుచులకు ఆధునిక రూపాన్ని జోడిస్తూ ప్రత్యేక మెనూను సిద్ధం చేశారు. భోజనంతో పాటు భారతీయ సంస్కృతి, సంగీతం, నృత్యాన్ని కూడా ప్రపంచ నేతలకు పరిచయం చేశారు.



# ఒకే ఫ్రేమ్‌లో ఆ ముగ్గురు

- మోదీ-జిన్‌పింగ్-పుతిన్..
- ఢిల్లీ బ్రిక్స్‌లో దౌత్య దృశ్యం

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర దృశ్యంగా మారింది. మోదీ.. పుతిన్, జిన్‌పింగ్ చేతులు పట్టుకున్న ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫొటోలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా ప్రధాని ప్రబోవో సుబియాంటో కూడా కనిపించారు. "బ్రిక్స్ సదస్సు 2026 ఢిల్లీలో ప్రారంభమైంది" అంటూ మోదీ ఈ చిత్రాన్ని పంచుకున్నారు. సదస్సు ప్రారంభ ప్రసంగంలో గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో కేవలం భాగస్వాములు కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగాల్సిన అవసరం ఉందని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.



వివరాలు 3లో..

# రాజీనామా చేయాల్సింది ఎవరు?



- నేను తీసుకుంటుంది రూపాయే జీతం
- హరీశ్‌రావుపై పొంగులేటి ఫైర్

22ఏ భూముల అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం పనిచేస్తుంటే, అసత్య ప్రచారాలతో తనను, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. “చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయాల్సింది కాదా?” అని నిలదీశారు. తాను ప్రతి నెల కేవలం ఒక్క రూపాయి జీతం తీసుకుంటూ పేదల కోసం పనిచేస్తున్నానని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజల కోసం పనిచేస్తున్న తనను రాజీనామా చేయాలని అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రస్తావిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా మంత్రి నిలదీశారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ.21 కోట్లు తీసుకున్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌లో ఉంటే.. రాజీనామా చేయాల్సింది ఎవరో చెప్పాలని ప్రశ్నించారు.

**‘పొంగులేటి.. పొంగు’ అంటూ ఎందుకంత భయం?**

ప్రతిపక్షాల రాజకీయ వైఖరిపైనా పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు చేశారు. “అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్” అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదని స్పష్టం చేశారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ “పొంగులేటి.. పొంగు” అంటూ చేస్తున్న వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. “అలా ఎందుకు పదేపదే అంటున్నారు? ఎందుకు అంత భయం?” అని ప్రశ్నించారు. శుభకార్యంలో పాలు పొంగితే శుభమని, కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంతో పొంగితే ఆ ప్రవాహంలో తమ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుందని ఘాటు వ్యాఖ్య చేశారు. గతంలో ఖమ్మం సభలో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కాలేరని తాను చెప్పిన మాటలను గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ అధికారంలోకి వచ్చేది ఇందిరమ్మ ప్రభుత్వమేనని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. 22ఏ భూముల అంశంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షాల విమర్శలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు.

# మెజారిటీ జనాభా... అధికారంలో మైనారిటీ

## 56% బీసీలు.. రాజకీయ రంగంలో వాటా ఎక్కడ?



- బడుగులు రాజకీయ ప్రాతినిధ్యం.. రౌండ్ టేబుల్ సమావేశం

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో “56% బీసీలు.. రాజకీయ రంగంలో వాటా ఎక్కడ?” అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో జరిగిన ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఎన్జీవోలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నాయకుడు తాడూరి శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ అధికారంలో మాత్రం తగిన వాటా ఎందుకు దక్కడం లేదన్న ప్రశ్న సమావేశంలో ప్రధానంగా వినిపించింది.

**మూడు మంత్రి పదవులు.. బీసీలకే ఇవ్వాలి**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను తక్షణమే బీసీలకు కేటాయించాలని సమావేశం ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. ముఖ్యంగా వడ్డెర, కుమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర ఇప్పటివరకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం పొందని బీసీ కులాలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. టి. చిరంజీవులు గణాంకాలతో కూడిన ప్రజెంటేషన్‌లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం క్రమంగా తగ్గుతున్న తీరును వివరించారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు బీసీలు మంత్రులుగా ఉండగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో నలుగురికి, 2018లో ముగ్గురికి, ప్రస్తుతం 2026లో ఇద్దరికి సంఖ్య తగ్గిందని తెలిపారు. ఇదే ధోరణి కొనసాగితే మంత్రివర్గంలో బీసీల ప్రాతినిధ్యం మరింత తగ్గి చివరకు శూన్యానికి చేరే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లోనూ బీసీల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతున్న తీరును గణాంకాలతో వివరించారు.

**ఓట్లు మనవి.. అధికారం ఎందుకు కాదు?**

శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ మెజారిటీ జనాభా కలిగిన బీసీలు రాజకీయ అధికారంలో మైనారిటీ స్థాయిలో ఉండటం బాధాకరమన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బీసీల ఐక్యతతోనే రాజకీయాధికారం సాధ్యమవుతుందని అన్నారు. జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని కోరారు. బాలగోని బాలరాజుగౌడ్ బీసీలకు కేవలం ఓటు హక్కు కాకుండా జనాభా ప్రాతిపదికన అధికారంలో వాటా కావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం గురించి మాట్లాడుతూనే అగ్రకులాలకు చెందిన వ్యక్తులను ముఖ్యమంత్రులుగా నియమిస్తోందని ఆయన విమర్శించారు. తాడూరి శ్రీనివాస్ బీసీ కులాలను విభజించే ప్రయత్నాలను తిప్పికొట్టి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కటకం నరసింహారావు తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ హక్కుల కోసం ఉద్యమం నిర్మించాలని అన్నారు. గుజ్జ సత్యం బీసీ రాజ్యాధికారం సాధ్యమేనని పేర్కొన్నారు. వట్టే జనార్దన్ యాదవ్ ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల్లో కనీసం ఒకటి యాదవులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విట్టల్ ఖమ్మం జిల్లాలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని, మున్నూరు కాపు సమాజానికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని కోరారు. “ఓట్లు మనవి..సీట్లు వారివా?” అనే పరిస్థితి ఇక కొనసాగకూడదని సమావేశం స్పష్టం చేసింది.

**బీసీ ఐక్యతే.. రాజకీయ భవిష్యత్తు**

బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా రాజకీయ నిర్ణయాధికారంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజు అడ్వొకేట్ తెలంగాణలో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బీసీలు సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ, న్యాయవాదుల్లో పెరుగుతున్న చైతన్యానికి అది నిదర్శనమన్నారు. భవిష్యత్తులో బార్ కౌన్సిల్ అధ్యక్ష పదవిని కూడా బీసీలు చేపట్టే పరిస్థితులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పొన్నం దేవరాజు బీసీ అడ్వొకేట్లు హక్కులు, రాజకీయ సామాజిక ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఎర్ర సత్యనారాయణ, సూర్యనారాయణ రిటైర్డ్ డీఆర్ఓ, ఇలి వెంకన్న, దుర్గయ్య గౌడ్, మెట్టు సూర్యప్రకాశ్, బైరి శేఖర్, కర్నాటి మనోహర్, చిన్నారాములు, ముదిరాజ్, చెన్న శ్రీకాంత్, బొంగు ప్రసాద్, నీరజ గౌడ్, లింగేశ్, చోళ రాజేశ్వర్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఏడు కీలక నిర్ణయాలు**

సమావేశంలో మూడు ఖాళీ మంత్రి పదవులను బీసీలకు కేటాయించడం, ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రాతినిధ్యం కల్పించడం, ఇప్పటివరకు అవకాశాలు దక్కని బీసీ కులాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ రాజకీయ ప్రాతినిధ్యంపై విస్తృత చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. బీసీలకు జరుగుతున్న రాజకీయ అన్యాయంపై గణాంకాలతో ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానించారు. బీసీ సమాజంలోని అన్ని కులాలు, సంఘాలు, మేధావులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ వాటా దక్కే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సమావేశం స్పష్టం చేసింది.

# పొంగులేటి.. తప్పు ఉంటే చర్యలేవి?

## భూములపై హరీశ్‌రావు ఎదురుదాడి




మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న భూముల ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. 1995లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేశారని, 2010లో అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమికి ఎన్ఓసీ ఇచ్చిందని హరీశ్‌రావు చెప్పారు. ఆ తర్వాత అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో తన మామ ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ భూమి విలువ రూ.15 కోట్లు అని పొంగులేటి చెబుతున్నారని, రూ.50 లక్షలు ఇచ్చి ఆ భూమిని పొంగులేటే తీసుకోవచ్చని సవాల్ చేశారు. మిషన్ భగీరథలో తమ కుటుంబ సభ్యుల భూమి పోయిందని, దానికి ప్రభుత్వం పరిహారం ఇచ్చిందన్న పొంగులేటి వ్యాఖ్యలపైనా హరీశ్‌రావు స్పందించారు. ఆ భూమి ‘గోదావరి సృజల స్రవంతి’ కార్యక్రమంలో పోయిందని, అదీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని స్పష్టం చేశారు. పొంగులేటి, రేవంత్ ప్రభుత్వానికి సంబంధించిన స్కామ్‌లు, పొంగులేటి కుమారుడి భూ వ్యవహారాలను బయటపెడుతున్నందుకే తనపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. “ఇప్పుడు అధికారంలో ఉన్నది నువ్వే.. తప్పు జరిగితే చర్యలు తీసుకో” అంటూ పొంగులేటికి హరీశ్‌రావు సూటి సవాల్ విసిరారు.

**22Aపై సమాధానం ఎక్కడ పొంగులేటి?**

22A అంశంపై బీఆర్ఎస్ లేవనెత్తిన ఒక్క ఆరోపణకు కూడా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. 2025 డిసెంబర్‌లో ప్రభుత్వం అప్‌లోడ్ చేసిన ఓ జాబితా కారణంగానే ఈ తప్పిదం జరిగిందని అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి స్వయంగా అంగీకరించారని గుర్తుచేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసినందుకు ప్రభుత్వం క్షమాపణ చెబుతుందని, 22A కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ఎప్పుడు తొలగిస్తారో స్పష్టత ఇస్తారని తాము ఆశించామని చెప్పారు. అయితే ఇప్పటివరకు కనీసం పశ్చాత్తాపం కూడా కనిపించలేదని మండిపడ్డారు. భూములపై ఆరోపణలు చేయడం కంటే 22A సమస్యకు పరిష్కారం చూపాలని, తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

# వినాయక మండపాలకు ఉచిత కరెంట్



- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ ప్రత్యేక సమీక్ష
- రూపాయి ఖర్చు లేకుండా విద్యుత్ సౌకర్యం




వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఉత్సవాల సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో పోలీస్, మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. పండుగ నిర్వహణలో క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముందుగానే దరఖాస్తు చేసుకుని ఈ సదుపాయం పొందాలని సూచించారు. మండపాల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో నమోదు చేయాలని కోరారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలను ముందుగానే నియంత్రించడంతో పాటు, భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టంగా చేపట్టేందుకు పోలీసులకు అవకాశం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

**చెరువుల వద్ద పటిష్ట నిమజ్జన ఏర్పాట్లు**

గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చెరువుల వద్ద ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల కోసం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారో, గణేశ్ నిమజ్జనాలకు కూడా అదే స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పెద్ద విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసర ప్రాంతాలను సిద్ధం చేయాలని, పెద్ద క్రేన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని సూచించారు. పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి.. యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి” అని సీఎం పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవ కమిటీలు సహకరించాలని కోరారు. మండప నిర్వాహకులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.



# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

• సీఎం రేవంత్‌పై సెటైర్లు! • సస్పెన్షన్‌కు నిరసన

అసెంబ్లీ నుంచి తమ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ శనివారం తెలంగాణ భవన్‌లో ‘మాక్ అసెంబ్లీ’ నిర్వహించింది. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం చేపట్టింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్ పాత్ర పోషించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని అనుకరిస్తూ తలసాని చేసిన వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ప్రభుత్వ హామీలు, మంత్రివర్గ నిర్ణయాలు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై చర్యలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**కొండా సురేఖ అంశంపై తలసాని సెటైర్లు**

మాజీ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ తలసాని తీవ్ర వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. “కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి ఆమెను అణచివేసి వచ్చాను” అంటూ సీఎం పాత్రలో రేవంత్‌రెడ్డిని అనుకరిస్తూ వ్యాఖ్యానించారు. బీసీ బిడ్డగా తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత సురేఖను కేబినెట్ నుంచి తొలగించక ఏం చేస్తానంటూ సెటైర్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల హామీల అమలుపైనా తలసాని చురకలు అంటించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం. అయితే ఏ 100 రోజుల్లో అని చెప్పామా?” అంటూ ప్రభుత్వ తీరును ఎద్దేవా చేశారు. ఢిల్లీలో తమకు కూడా కొన్ని ఇబ్బందులు ఉంటాయంటూ మరో వ్యంగ్యాస్త్రం సంధించారు.

**22 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్..**






**బీఆర్ఎస్ ఆగ్రహం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రయత్నించిన సమయంలో ప్రభుత్వం చర్చకు అవకాశం ఇవ్వలేదని పార్టీ నేతలు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 9న కేటీఆర్‌తో పాటు 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. దీనికి నిరసనగా నిర్వహించిన మాక్ అసెంబ్లీలో కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రభుత్వం చర్చకు అనుమతించలేదని పేర్కొన్న ప్రజా సమస్యలను ఈ వేదికపై బీఆర్ఎస్ నేతలు ప్రస్తావించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కుతున్నారని ఆరోపిస్తూ, మాక్ అసెంబ్లీ ద్వారా ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.

# కొండా సురేఖకు ఢిల్లీ పిలుపు!

## అసంతృప్తి చల్లార్చే ప్రయత్నమా?



మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అత్యవసర ఢిల్లీ పిలుపు రావడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి కోల్పోయాక ఢిల్లీకి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందింది. శుక్రవారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ స్వయంగా కొండా సురేఖతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం ఆమెకు అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ రావాలని పిలుపు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పదవి నుంచి తొలగించిన వెంటనే అధిష్ఠానం నేరుగా జోక్యం చేసుకోవడంతో కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందన్న ఆసక్తి పెరిగింది. కొండా సురేఖతో అధిష్ఠానం ఏం చర్చించనుంది? ఆమెకు ఎలాంటి హామీ ఇవ్వనుంది? అనే ప్రశ్నలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**కేబినెట్ హోదా పదవి ఇస్తారా?**

మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖలో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె రాజకీయ సేవలను గుర్తించి పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు కేబినెట్ హోదా కలిగిన కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి లేదా మరో కీలక బాధ్యత అప్పగించే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపైనే ఢిల్లీ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇలాంటి ప్రతిపాదన తెరపైకి రావడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ పర్యటన తర్వాత కొండా సురేఖకు అధిష్ఠానం ఎలాంటి భరోసా ఇస్తుంది? కొత్త బాధ్యత ఏదైనా అప్పగిస్తుందా? అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. అధికారిక నిర్ణయం వెలువడితేనే ఈ ప్రచారానికి తెరపడనుంది.

# మాక్ అసెంబ్లీకి కూడా రాలేరా?

## కేసీఆర్‌పై సీతక్క ఘాటు విమర్శలు

బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని, ప్రజాస్వామ్యాన్ని అవమానించే కార్యక్రమమని విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం, పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించడాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీకి హాజరుకాని కేసీఆర్ కనీసం తమ పార్టీ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడాన్ని సీతక్క ప్రస్తావించారు. “అసెంబ్లీకి రాని కేసీఆర్.. మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే చట్టసభలపై ఆయనకు ఎంత నమ్మకం ఉంది?” అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో సచివాలయానికి రారని, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీకి కూడా రావడం లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్ వద్ద దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేసినప్పుడు బీఆర్ఎస్ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆరోపించారు.

**స్పీకర్ అవమానమా.. దొర అహంకారమా?**

ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం, పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ నిర్వహించడం వెనుక “దొరల ఆధిపత్య అహంకారం” కనిపిస్తోందని సీతక్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నాయకులు ఉన్న చోటుకే వ్యవస్థలు రావాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదని విమర్శించారు. స్పీకర్ పదవిని, చట్టసభల గౌరవాన్ని బీఆర్ఎస్ నేతలు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అసెంబ్లీకి ప్రత్యేక గౌరవం ఉందని, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు అక్కడే ప్రజా సమస్యలను చర్చించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించడం ద్వారా అసలు శాసనసభకు ప్రత్యామ్నాయం సృష్టించలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, చట్టసభలను అవమానించే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని మంత్రి సీతక్క హెచ్చరించారు.





# బ్రిక్స్ విందులో భారత్ రుచుల సందడి!

## 160 మంది కళాకారులతో సాంస్కృతిక వేడుక
## బ్రిక్స్ నేతలకు భారతీయ ఆతిథ్యం

బ్రిక్స్ సదస్సు తొలిరోజు కీలక సమావేశాలు, విధాన చర్చలతో బిజీగా సాగిన తర్వాత ఢిల్లీలోని భారత్ మండపంలో బ్రిక్స్ దేశాల అధినేతలు, ప్రముఖ అతిథులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక గాలా డిన్నర్ ఇచ్చారు. భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రపంచ నేతలకు పరిచయం చేసేలా విందును నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేక వంటకాలను మెనూలో చేర్చారు. దక్షిణ భారత రుచుల నుంచి పాత ఢిల్లీ ప్రసిద్ధ వంటకాల వరకు భారతీయ వంటకాల వైవిధ్యం విందులో ఆకట్టుకుంది. ప్రాంతీయ రుచులకు ఆధునిక రూపాన్ని జోడిస్తూ ప్రత్యేక మెనూను సిద్ధం చేశారు. భోజనంతో పాటు భారతీయ సంస్కృతి, సంగీతం, నృత్యాన్ని కూడా ప్రపంచ నేతలకు పరిచయం చేశారు.

### ఖండ్వీ నుంచి జలేబీ వరకు

గాలా డిన్నర్ మెనూలో ప్రారంభ వంటకాలుగా ఖండ్వీ మిల్లెఫోయ్, ఖుంబ్ గలౌటీ వడ్డించారు. ప్రధాన వంటకాల్లో పనీర్ లబాబ్దార్, హిమాలయన్ గుచ్చి మష్రూమ్స్‌తో గుచ్చి మార్మిక్, క్యారెట్ బీన్ పోరియల్, టమాటాతో తక్కాళి బెల్లె సారు, మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రాయితా వంటి వంటకాలను అందించారు. వీటితో పాటు వివిధ రకాల భారతీయ రొట్టెలను వడ్డించారు. డెజర్ట్‌లో పాత ఢిల్లీ శైలిలో ఫ్రూట్ క్రీమ్‌తో జలేబీ, మల్బరీతో షాహ్‌తూత్ ఫిర్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశంలోని భిన్న ప్రాంతాల వంటకాల రుచులను ఒకే మెనూలోకి తీసుకురావడం ద్వారా భారతీయ ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా విందును నిర్వహించారు. సాంప్రదాయ రుచులకు ఆధునిక ప్రదర్శనను జోడించడం మెనూకు ప్రత్యేకతగా నిలిచింది.

### 160 మంది కళాకారులతో 'బ్రిక్స్ సింఫనీ'

విందులో ఆహారంతో పాటు కళా ప్రదర్శన కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 160 మంది భారతీయ, అంతర్జాతీయ కళాకారులు 'బ్రిక్స్ సింఫనీ' పేరుతో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, కథక్ వంటి భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ భారతీయ వాయిద్యాలతో సంగీత ప్రదర్శన సాగింది. ఇతర బ్రిక్స్ దేశాలకు చెందిన కళాకారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. సుమారు 20 నుంచి 25 నిమిషాల పాటు సాగిన ప్రదర్శనలో గాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. భారతీయ కళాకారులు ప్రత్యేకంగా రిహార్సల్స్ చేసి ఈ కార్యక్రమాన్ని సిద్ధం చేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన సాంస్కృతిక విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని రూపొందించారు. భారతీయ రుచులు, భారతీయ కళలు, సంస్కృతిని ప్రపంచ నేతలకు పరిచయం చేసిన వేదికగా బ్రిక్స్ గాలా డిన్నర్ నిలిచింది.

# హద్దుల్లో ఉండాల్సిందే

## చైనా అధ్యక్షుడికి మోదీ క్లారిటీ
## భారత్–చైనా బంధానికి శాంతి కీలకం

ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీ కీలకంగా మారింది. ఏడు సంవత్సరాల తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, ద్వైపాక్షిక సంబంధాలపై నేతలు విస్తృతంగా చర్చించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత కొనసాగితేనే భారత్-చైనా సంబంధాలు మరింత ముందుకు సాగుతాయని మోదీ స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, పరస్పర అవగాహనలను ఇరుపక్షాలు గౌరవించాలని ఆయన సూచించారు. సరిహద్దు వివాదానికి న్యాయమైన, సహేతుకమైన, ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలు అంగీకరించారు.

### భేదాలు వివాదాలుగా మారొద్దు

విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025 ఆగస్టులో టియాంజిన్‌లో జరిగిన సమావేశం తర్వాత భారత్-చైనా సంబంధాల్లో స్థిరమైన పురోగతి కనిపించిందని ఇరువురు నేతలు గుర్తించారు. "భేదాలు వివాదాలుగా మారకూడదు" అన్న వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం, పరస్పర ప్రయోజనం అనే మూడు అంశాల ఆధారంగా సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మరోవైపు జిన్‌పింగ్ మాట్లాడుతూ భారత్, చైనా ఒకరి బలాలను మరొకరు నేర్చుకుని పరస్పరం సహకరించుకోవచ్చని అన్నారు. తన పుట్టినరోజైన జూన్ 15న భారత్ పర్యటనకు ఆహ్వానం అందుకోవడం గుర్తుండిపోయే విషయమని పేర్కొన్నారు. మోదీతో ఇప్పటి వరకు 21 సార్లు సమావేశమై కీలక అవగాహనలకు వచ్చినట్లు తెలిపారు. ఇరుదేశాలు ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు, గ్లోబల్ సౌత్‌లో కీలక భాగస్వాములుగా కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

### సరిహద్దు నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యానికి..

మోదీ-జిన్‌పింగ్ భేటీలో ఇరుదేశాల సంబంధాలను మరింత విస్తరించేందుకు కొత్త చర్యలను పరిశీలించారు. వాణిజ్యం, పెట్టుబడులు సహా వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచే అవకాశాలపై చర్చ జరిగింది. చైనా వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆ దేశానికి మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో సరిహద్దు శాంతి అంశాన్ని భారత్ అత్యంత కీలకంగా ముందుకు తెచ్చింది. ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. 3,488 కిలోమీటర్ల సరిహద్దు వివాదానికి పరిష్కారం, వాస్తవ నియంత్రణ రేఖ వద్ద శాంతి, సరిహద్దు నిర్ధారణ వంటి అంశాలు ఆ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. మొత్తం మీద మోదీ-జిన్‌పింగ్ భేటీతో భారత్-చైనా సంబంధాల్లో సహకారానికి తలుపులు తెరుచుకుంటున్నా, సరిహద్దు శాంతి, పరస్పర విశ్వాసమే భవిష్యత్ బంధానికి అసలు పరీక్షగా నిలిచింది.



# ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్!

## పహల్గామ్ మారణకాండపై తీర్మానం

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో పహల్గామ్ ఉగ్రదాడి అంశం మరోసారి అంతర్జాతీయ వేదికపై బలంగా ప్రస్తావనకు వచ్చింది. బ్రిక్స్ దేశాల నేతలు 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. బైసరన్ లోయలో జరిగిన ఈ మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. 140 అంశాలతో కూడిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌లోని 40వ అంశంలో ఈ దాడిని ప్రస్తావించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నేరమే, ఎలాంటి కారణం చూపినా సమర్థించలేమని బ్రిక్స్ నేతలు స్పష్టం చేశారు. ఉగ్రవాదుల దాడులు మానవత్వానికి, ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా అభివర్ణించారు.



### సరిహద్దు దాటే ఉగ్రవాదంపై చర్యలు

పహల్గామ్ దాడి వెనుక పాకిస్థాన్ నుంచి మద్దతు, శిక్షణ పొందిన ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు భారత దర్యాప్తులో తేలిన నేపథ్యంలో బ్రిక్స్ ప్రకటనలో సరిహద్దు దాటి ఉగ్రవాద కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే ఏ దేశాన్నీ నేరుగా పేరుపెట్టి విమర్శించలేదు. ఉగ్రవాదుల సరిహద్దు దాటే కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి వాటిపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సభ్యదేశాలను కోరారు. ఉగ్రవాదాన్ని ఏ మతంతో, జాతీయతతో, నాగరికతతో, జాతితో ముడిపెట్టకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిని చట్టపరంగా బాధ్యులను చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని పాటించాలని బ్రిక్స్ నేతలు స్పష్టం చేశారు.

### యువతలో ర్యాడికలైజేషన్‌పై ఫోకస్

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యంగా పనిచేయడంతో పాటు తీవ్రవాద భావజాలం, ర్యాడికలైజేషన్‌ను అడ్డుకోవాల్సిన అవసరాన్ని కూడా బ్రిక్స్ దేశాలు గుర్తించాయి. ముఖ్యంగా యువతలో తీవ్రవాద భావజాలం వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించాయి. ఉగ్రవాద సంస్థలు, ఐక్యరాజ్యసమితి గుర్తించిన ఉగ్రవాదులపై సమిష్టి చర్యలు తీసుకోవాలని కోరాయి. భద్రతా సంస్థల మధ్య సమాచార మార్పిడి, ఉత్తమ పద్ధతుల భాగస్వామ్యాన్ని పెంచాలని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. పహల్గామ్ దాడిని బ్రిక్స్ గతంలోనూ ఖండించింది. 2025 జూలైలో రియో డి జెనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సులోనూ, అనంతరం షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ ఈ దాడిపై ఖండన వ్యక్తమైంది. తాజా న్యూఢిల్లీ డిక్లరేషన్‌తో పహల్గామ్ దాడిపై అంతర్జాతీయంగా భారత్‌కు మరోసారి మద్దతు లభించినట్లైంది. ఉగ్రవాదానికి కారణాలు ఏవైనా, దాని వెనుక ఎవరున్నా ఉగ్రవాదంపై రాజీ లేని పోరాటమే తమ వైఖరి అని బ్రిక్స్ నేతలు స్పష్టం చేశారు.



# ఒకే ఫ్రేమ్‌లో ఆ ముగ్గురు

## మోదీ–జిన్‌పింగ్–పుతిన్.. ఢిల్లీ బ్రిక్స్‌లో దౌత్య దృశ్యం

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర దృశ్యంగా మారింది. మోదీ.. పుతిన్, జిన్‌పింగ్ చేతులు పట్టుకున్న ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫొటోలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా ప్రధాని ప్రబోవో సుబియాంటో కూడా కనిపించారు. "బ్రిక్స్ సదస్సు 2026 ఢిల్లీలో ప్రారంభమైంది" అంటూ మోదీ ఈ చిత్రాన్ని పంచుకున్నారు. సదస్సు ప్రారంభ ప్రసంగంలో గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో కేవలం భాగస్వాములు కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగాల్సిన అవసరం ఉందని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.

# శత్రుదుర్భేద్యం జిన్‌పింగ్ విమానం

## ఆకాశంలోనే చైనా అధ్యక్షుడి భద్రతకు కోట
## బోయింగ్ 747లో మొబైల్ కమాండ్ సెంటర్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ విదేశీ పర్యటనలకు ఉపయోగించే అధికారిక విమానం సాధారణ విమానం కాదు. ఎయిర్ చైనా నిర్వహించే బోయింగ్ 7478 ఇంటర్‌కాంటినెంటల్‌ను ప్రత్యేకంగా మార్పులు చేసి చైనా అధ్యక్షుడి స్టేట్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా రూపొందించారు. 2014 చివర్లో ఇది వాణిజ్య ప్రయాణికుల విమానంగా సేవలు ప్రారంభించింది. 2015 మేలో వాణిజ్య సేవల నుంచి పూర్తిగా తప్పించి, నెలలపాటు భారీ మార్పులు చేపట్టారు. ప్రత్యేక భద్రతా వ్యవస్థలు, అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, విలాసవంతమైన వీఐపీ అంతర్గత సదుపాయాలు ఏర్పాటు చేశారు. 2016 శరదృతువులో ఇది చైనా అధ్యక్షుడి ప్రధాన అధికారిక విమానంగా సేవల్లోకి వచ్చింది. 76.4 మీటర్ల పొడవు, సుమారు 4.42 లక్షల కిలోల గరిష్ఠ టేకాఫ్ బరువు, నాలుగు GEnx2B67 ఇంజిన్లు, గంటకు సుమారు 982 కిలోమీటర్ల వేగం, దాదాపు 14,500 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యం దీని ప్రత్యేకతలు.

### ఈ విమానమే.. గాల్లో కమాండ్ సెంటర్

జిన్‌పింగ్ విమానంలో అత్యంత కీలకమైన అంశం దాని భద్రతా వ్యవస్థలే. మిలిటరీ స్థాయి ఎన్‌క్రిప్టెడ్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా అధ్యక్షుడు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ప్రభుత్వ, సైనిక కమాండ్ కేంద్రాలతో సంప్రదింపులు కొనసాగించగలరని సమాచారం. ప్రమాదాలను గుర్తించే వ్యవస్థలు, క్షిపణి దాడులను ఎదుర్కొనే రక్షణ చర్యలు కూడా ఇందులో ఉన్నట్లు పేర్కొంటున్నారు. అంతేకాదు, విమానంలోని ఎలక్ట్రానిక్ వ్యవస్థలను భారీ ఎలక్ట్రో మాగ్నెటిక్ దాడుల నుంచి కాపాడేందుకు ఈఎంపీ షీల్డింగ్ ఏర్పాటు చేసినట్లు వివరాలు చెబుతున్నాయి. ఈఎంపీ అంటే శక్తివంతమైన విద్యుదయస్కాంత తరంగాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను రక్షించే ప్రత్యేక కవచ వ్యవస్థ. చైనా అధ్యక్షుడు, స్టేట్ కౌన్సిల్ ప్రీమియర్ మాత్రమే ఈ అధికారిక విమానాన్ని అంతర్జాతీయ పర్యటనలకు ఉపయోగించేందుకు అనుమతి కలిగి ఉంటారు. ఇతర నేతలు సాధారణంగా ఎయిర్ చైనా చార్టర్ విమానాలపై ఆధారపడతారు. గతంలో చైనా నాయకులు వాణిజ్య బోయింగ్ 747400 విమానాలను ఉపయోగించేవారు. పర్యటనకు ముందు సుమారు 20 రోజుల్లో వాటిని వీవీఐపీ విమానాలుగా మార్చి, తిరిగి సాధారణ ప్రయాణికుల విమానాలుగా ఉపయోగించేవారు.

### 27 నిఘా పరికరాల కలకలం

చైనా అధ్యక్షుడి విమాన వ్యవస్థ వెనుక మరో ఆసక్తికరమైన ఘటన కూడా ఉంది. 2001లో అప్పటి అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ కోసం అమెరికాలో ప్రత్యేకంగా మార్పులు చేసిన విమానాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం. విమానం చైనాకు చేరిన తర్వాత అందులో 27 రహస్య వినికిడి పరికరాలు దాచినట్లు గుర్తించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. చైనా ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు, ఖండించలేదు. అయితే కొన్ని నెలల తర్వాత చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి చైనాపై నిఘా పెట్టాల్సిన అవసరమే లేదన్న వ్యాఖ్య చేశారు. ఆ ఘటన తర్వాత చైనా అధ్యక్షుడి విమాన భద్రతపై మరింత అప్రమత్తత పెరిగినట్లు భావిస్తారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఉపయోగిస్తున్న బోయింగ్ 7478లో సురక్షిత కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ రక్షణ, ప్రమాద గుర్తింపు వంటి వ్యవస్థల సమ్మేళనం ఉండటం వల్ల అది కేవలం ప్రయాణ సాధనం కాకుండా గాల్లోనే పనిచేసే రక్షిత కమాండ్ కేంద్రంగా నిలుస్తోంది.






# అడుగడుగునా నిఘా

## జిన్‌పింగ్‌కి పటిష్ఠ భద్రతా వలయం
## 15 వేల మందితో 24 గంటల పహారా

ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకరోజు పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం ఢిల్లీ చేరుకున్న జిన్‌పింగ్ సుమారు 24 గంటలు భారత్‌లో ఉండనున్నారు. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ద్వైపాక్షిక భేటీ జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు సహా భారత్-చైనా సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. జిన్‌పింగ్ వెంట ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులు, వ్యాపార ప్రతినిధులతో కూడిన భారీ బృందం వచ్చింది. ఆయన బస చేసే న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్ చుట్టూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. హోటల్ పరిసరాలను నోఫ్లై జోన్‌గా ప్రకటించి, యాంటీ టెర్రర్, బాంబ్ డిటెక్షన్ బృందాలను మోహరించారు. అణు, రేడియేషన్, బయోకెమికల్ ముప్పులను గుర్తించే ప్రత్యేక తనిఖీలు కూడా చేపట్టారు. హోటల్ చుట్టూ భూగర్భ పైపులైన్లు, ఇతర మౌలిక వసతులను సైతం పరిశీలించారు.

### 10 రోజుల ముందే చేరిన లిమోసిన్

జిన్‌పింగ్ పర్యటన భద్రతలో మరో ఆసక్తికర అంశం ఆయన అధికారిక వాహనం. చైనా సుమారు 10 రోజుల ముందుగానే కార్గో విమానం ద్వారా జిన్‌పింగ్ హోంగ్‌చీ స్టేట్ లిమోసిన్, బ్యాకప్ వాహనం, కమ్యూనికేషన్ పరికరాలను భారత్‌కు పంపినట్లు సమాచారం. విదేశీ భద్రతా బృందాలు తీసుకొచ్చే కొన్ని పరికరాలకు భారత నిబంధనలు వర్తిస్తాయి. శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాలకు అనుమతి లేదని, కొన్ని ఆయుధాలు, భద్రతా పరికరాలను దేశంలోకి తీసుకురావడం నిషేధమని అధికారులు తెలిపారు. అలాంటి పరికరాలను కస్టమ్స్ వద్ద జమ చేయాల్సి ఉంటుంది. విదేశీ భద్రతా సంస్థలు వ్యక్తం చేసే ఆందోళనలను ఢిల్లీ పోలీసులు, ఇతర భద్రతా సంస్థలతో సమన్వయం చేస్తూ విదేశాంగ శాఖ ప్రోటోకాల్ ప్రకారం చర్యలు తీసుకుంటోంది. జిన్‌పింగ్ ఆదివారం ఉదయం సుమారు 11 గంటలకు భారత్ మండపం నుంచి విమానాశ్రయానికి బయలుదేరే అవకాశం ఉంది. ఆయన ప్రయాణించే బోయింగ్ 7478 కూడా ప్రత్యేక భద్రతా వ్యవస్థలతో కూడిన అత్యాధునిక స్టేట్ ఎయిర్‌క్రాఫ్ట్ కావడం గమనార్హం.

### 15 వేల పోలీసులు..
### 200 పారా మిలటరీ కంపెనీలు

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఢిల్లీ మొత్తం భద్రతా వలయంలోకి వెళ్లింది. 15 వేల మందికి పైగా పోలీసులు, 200 కంపెనీల పారా మిలటరీ బలగాలను మోహరించారు. కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. నగరంలోని వివిధ జోన్లు, సెక్టార్లలో పోలీసు బలగాలను విభజించి విధుల్లో పెట్టారు. సాంకేతిక నిఘా వ్యవస్థలను కూడా విస్తృతంగా వినియోగిస్తున్నారు. జిన్‌పింగ్ ప్రయాణించే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-శాంతి పథ్ మార్గంలో 700కు పైగా సీసీటీవీ కెమెరాలు, ఐదు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సీసీటీవీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సుమారు 500 కెమెరాల ఫీడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, అనుమానాస్పద కదలికల గుర్తింపు కోసం అదనపు కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఒకరోజు పర్యటన కోసం ఢిల్లీ మొత్తం ఇంత భారీ భద్రతా ఏర్పాట్లతో సిద్ధం కావడం జిన్‌పింగ్ పర్యటన ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది.

# ఉత్తరాంధ్రపై వర్షం పంజా

## 48 గంటలు అప్రమత్తత
## అల్పపీడనంతో భారీ వర్షా లు

ఆంధ్రప్రదేశ్‌పై వర్ష ముప్పు మళ్లీ పెరిగింది. రానున్న 48 గంటల్లో రాష్ట్రంలోని పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రాంతం రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదిలి విదర్భ వైపు వెళ్లే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలకు ఎక్కువ అవకాశం ఉంది. ఇప్పటికే శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షాభావంతో ఇబ్బంది పడిన ప్రాంతాలకు ఈ వానలు కొంత

### నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు

అల్పపీడన ప్రభావంతో విజయవాడ, విశాఖపట్నంలో ఉరుములతో కూడిన వర్షాలు నమోదయ్యాయి. విజయవాడలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెంజ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో వాహనాలు దాదాపు గంటపాటు నిలిచిపోయాయి. విశాఖలో వరద పరిస్థితి లేకపోయినా చిరుజల్లులు, మోస్తరు వర్షాలు కొనసాగాయి. దీంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆదివారం ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. ఆదివారం అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే

రాజకీయాల్లో కొన్ని పరిణామాలు ఒకరోజు వార్తగా ముగుస్తాయి. మరికొన్ని మాత్రం తర్వాతి పరిణామాలకు సంకేతాలుగా నిలుస్తాయి. ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాల్లో మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను టీడీపీలో చేరిన ఘటన ఇప్పుడు రెండో కోవకు చేరిందా అన్న చర్చ మొదలైంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా, జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన చిన్న శ్రీను.. బొత్స సత్యనారాయణ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. సెప్టెంబర్ 8న చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోవడం సాధారణ పార్టీ మార్పుగా కనిపించినా.. రెండు రోజులకే గరివిడిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో బొత్స సత్యనారాయణ కంటతడి పెట్టడం రాజకీయంగా కొత్త ప్రశ్నలకు దారి తీసింది. ముఖ్యంగా "చిన్న శ్రీను వ్యవహార శైలిపై ఎనిమిది నెలల ముందే అనుమానం వచ్చింది" అన్న బొత్స వ్యాఖ్య ఇప్పుడు ఈ మొత్తం వ్యవహారానికి కేంద్రబిందువైంది. అనుమానం ఏంటి? పార్టీ మార్పు గురించి ముందే సమాచారం ఉందా? ఆ విషయం వైసీపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లిందా? వెళ్లి ఉంటే ఏం జరిగింది? చెప్పకుండా తనలోనే ఎందుకు ఉంచుకున్నారు? ఇవన్నీ సహజంగా వచ్చే ప్రశ్నలు. అయితే ఇక్కడే రాజకీయ విశ్లేషణకు ఒక హద్దు అవసరం. చిన్న శ్రీను పార్టీ మార్పు వెనుక బొత్స పాత్ర ఉందని నిర్ధారించే ఆధారం లేదు. బొత్సే ఆయన్ను టీడీపీలోకి పంపించారన్న ప్రచారానికి కూడా ధృవీకరణ లేదు. చిన్న శ్రీను వైపు నుంచి వ్యక్తిగత విభేదాలు లేవన్న వివరణలు కూడా వచ్చాయి. కాబట్టి ఊహాగానాలను వాస్తవాలుగా మార్చడం సరైంది కాదు. అదే సమయంలో ఈ పరిణామాన్ని పూర్తిగా సాధారణంగా కొట్టిపారేయడం కూడా అంతే తప్పు. ఒక రాజకీయ కుటుంబానికి చెందిన కీలక నాయకుడు ప్రత్యర్థి పార్టీలో చేరినప్పుడు దాని వెనుక వ్యక్తిగత నిర్ణయం ఎంత ఉందో, స్థానిక రాజకీయ లెక్కలు ఎంత ఉన్నాయో పరిశీలించాల్సిందే. ఇక్కడ అసలు కథ చిన్న శ్రీను టీడీపీలో చేరడమే కాదు.. ఆయన వెళ్లిపోయే పరిస్థితి ఎలా వచ్చింది అన్నదే.




## చిన్న శ్రీను నిష్క్రమణతో మనోవేదన.. ఎనిమిది నెలల అనుమానం వెనుక ప్రశ్నలు

# ఆ కన్నీళ్లు.. వైసీపీకి పెద్ద రాజకీయ సంకేతమా?

చిన్న శ్రీను చేరిక ఒక్కసారిగా జరిగిన నిర్ణయం కాదన్న సంకేతం టీడీపీ వైపు నుంచి వచ్చింది. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్థానిక టీడీపీ నాయకత్వం అంగీకారంతోనే ఆయనను పార్టీలోకి తీసుకున్నామని వెల్లడించారు. అంటే ఈ చేరికకు కొంతకాలం రాజకీయ చర్చ జరిగినట్టు అర్థమవుతోంది. అయితే ఆ చర్చలు ఎప్పుడు మొదలయ్యాయి? ఎవరెవరితో జరిగాయి? ఏ అంశాలు చర్చకు వచ్చాయి? అన్నది బహిరంగంగా తెలియలేదు. ఇదే సమయంలో "చిన్న శ్రీను మొదటివాడే.. ఇంకొందరు కూడా వెళ్లొచ్చు" అన్న ప్రచారం మొదలైంది. దీనికి ఇప్పటివరకు అధికారిక ఆధారం లేదు. అందుకే దాన్ని వార్తగా కాకుండా రాజకీయ వాతావరణాన్ని అర్థం చేసుకునే సూచనగా మాత్రమే చూడాలి. అసలు విషయం ఏమిటంటే..

2024 ఎన్నికల తర్వాత ఉత్తరాంధ్రలో వైసీపీ తన పాత రాజకీయ నిర్మాణాన్ని తిరిగి కట్టుకోవాల్సిన పరిస్థితిలో ఉంది. మరోవైపు కూటమి ప్రభుత్వం అభివృద్ధి,

### ఒక్క చేరిక కాదు.. రాజకీయ లెక్కల మార్పు

పెట్టుబడులు, మౌలిక వసతులు, కనెక్టివిటీ అంశాలను రాజకీయ కథనంగా ముందుకు తీసుకెళ్తోంది. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ పెట్టుబడి ప్రతిపాదనలు, భోగాపురం విమానాశ్రయం, ఉత్తరాంధ్రలో పరిశ్రమలు వంటి అంశాలు అధికార పక్షానికి కొత్త ప్రచార ఆయుధాలుగా మారుతున్నాయి. దీంతో ఉత్తరాంధ్ర రాజకీయ పోరాటం కేవలం పార్టీ గుర్తుల పోటీగా మిగలడం లేదు. "ఎవరు అభివృద్ధి తెస్తున్నారు? ఎవరి వెంట రాజకీయ భవిష్యత్తు ఉంది?" అనే ప్రశ్నలు కూడా నాయకుల నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి వస్తున్నాయి. వైసీపీ పూర్తిగా బలహీనపడిందని చెప్పడం తప్పు. ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, గుడివాడ అమర్నాథ్ వంటి నేతలు పార్టీ కార్యక్రమాల్లో కొనసాగుతున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. వరుదు కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్ వంటి నేతల విషయంలో పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారాలకు కూడా ప్రస్తుతం పక్కా నిర్ధారణ లేదు. అందువల్ల వైసీపీలో వలసలు మొదలయ్యాయని తేల్చడం తొందరపాటు. కానీ నాయకత్వ సమన్వయం, ఆధిపత్యం, వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుపై చర్చ పెరుగుతున్నదన్నది మాత్రం విస్మరించలేని అంశం. చిన్న శ్రీను నిష్క్రమణ ఆ చర్చకు మరింత బలం ఇచ్చింది. ఇదే ఈ ఘటనలో రాజకీయంగా గమనించాల్సిన కీలక మలుపు.

### బొత్స కన్నీళ్లు చెప్పిన అసలు పాఠం

ఈ మొత్తం పరిణామం నుంచి తెలుగు రాష్ట్రాల రాజకీయాలు నేర్చుకోవాల్సిన విషయం ఒక్కటే కాదు.. చాలా స్పష్టమైన పాఠాలు ఉన్నాయి. మొదటిది నాయకుడిని కోల్పోవడం కంటే.. నాయకుడి నమ్మకాన్ని కోల్పోవడం పార్టీలకు పెద్ద ప్రమాదం. ఒక నాయకుడు పార్టీని వీడినప్పుడు అతని వెంట ఎంతమంది వెళ్తారన్నది ఒక ప్రశ్న. కానీ ఆయన ఎందుకు వెళ్లాల్సి వచ్చింది అన్నది అంతకంటే పెద్ద ప్రశ్న. రెండోది కుటుంబ అనుబంధాలు రాజకీయ అనుబంధాలకు శాశ్వత హామీకావు. ఎన్నేళ్ల బంధం ఉన్నా రాజకీయ పరిస్థితులు మారితే వ్యక్తిగత నిర్ణయాలు కూడా మారవచ్చు. మూడోది కేడర్‌కు పార్టీ భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం నాయకత్వం ప్రధాన బాధ్యత. నాయకులు తమ భవిష్యత్తు ఎక్కడ సురక్షితంగా ఉంటుందో ఆలోచించడం మొదలుపెడితే.. అక్కడి నుంచి వలసల చర్చ మొదలవుతుంది. నాలుగోది.. అభివృద్ధి రాజకీయాలను ఎవరూ తక్కువ అంచనా వేయలేరు. విమానాశ్రయాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, కనెక్టివిటీ వంటి అంశాలు రేపటి ఎన్నికల్లో రాజకీయ ప్రచారానికి కీలకంగా మారవచ్చు. గతంలో ప్రజా సమస్యల ఆధారంగా అధికారాన్ని ప్రశ్నించిన ప్రతిపక్షానికి.. అభివృద్ధి పనులపై సమాధానం చెప్పాల్సిన కొత్త పరిస్థితి రావచ్చు. ఐదోది.. సోషల్ మీడియా ప్రచారం రాజకీయ వాస్తవానికి ప్రత్యామ్నాయం కాదు. చిన్న శ్రీను తర్వాత ఇంకెవరైనా వెళ్తారా? బొత్స భవిష్యత్తు ఏంటి? వైసీపీలో మరిన్ని మార్పులు వస్తాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు కాలమే చెప్పాలి. ఇప్పుడే తీర్పు చెప్పడం విశ్లేషణ కాదు. ఈ నేపథ్యంలో బొత్స కన్నీళ్లను కేవలం కుటుంబ బాధగా చూడటం కూడా సరైంది కాదు. అదే సమయంలో దాన్ని రాజకీయ కుట్ర కు సాక్ష్యంగా చూపడం కూడా సరికాదు. ఆ కన్నీళ్ల వెనుక రెండు దశాబ్దాల రాజకీయ అనుబంధం ఉండొచ్చు. ఒక నాయకుడి నిష్క్రమణపై వ్యక్తిగత వేదన ఉండొచ్చు. పార్టీ భవిష్యత్తుపై ఆందోళన కూడా ఉండొచ్చు. అసలు సంకేతం మాత్రం వేరే చోటుంది. ఒకప్పుడు బలమైన రాజకీయ శిబిరంగా కనిపించిన వ్యవస్థలో ఒక కీలక నాయకుడు ప్రత్యర్థి గూటికి వెళ్లాడు. ఇప్పుడు ఆ ఖాళీని వైసీపీ ఎలా భర్తీ చేస్తుంది? మిగిలిన నాయకులకు ఎలాంటి భరోసా ఇస్తుంది? కేడర్‌లో నమ్మకాన్ని ఎలా పెంచుతుంది? అన్నదే కీలకం. చిన్న శ్రీను ఒక వ్యక్తి మాత్రమేనా? లేక మారుతున్న రాజకీయ గాలికి తొలి సంకేతమా? ఇప్పుడే తేల్చలేం. కానీ ఈ ఘటన తెలుగు రాష్ట్రాల పార్టీలకు ఒక గట్టి హెచ్చరిక మాత్రం ఇస్తోంది. ఎన్నికల ముందు ఓటర్లను ఆకర్షించడం ఎంత ముఖ్యమో.. ఎన్నికలకు ముందే నాయకులు పార్టీని ఎందుకు వీడాలని ఆలోచిస్తున్నారో గుర్తించడం కూడా అంతే ముఖ్యం. ఒక నాయకుడు వెళ్లిపోవడం వార్త కావచ్చు. ఆ నాయకుడు ఎందుకు వెళ్లిపోయాడన్న ప్రశ్న మాత్రం రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారవచ్చు.





## చీరాలలో నేడు ఉచిత మట్టి వినాయకులు

### పర్యావరణ పరిరక్షణకు 12 ఏళ్లుగా సేవ

వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో చీరాలలో నేడు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు, పూజా వ్రత పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా ఓగేటి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో, ఓగేటి విశ్వనాథ శాస్త్రి, ఓగేటి సిద్ధనాథ శాస్త్రి సౌజన్యంతో సుమారు వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా అందించనున్నారు. సెప్టెంబర్ 13న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొట్ల బజార్‌లోని పచ్చతోరణం కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఓగేటి శ్రీనివాస శాస్త్రి నివాసం వద్ద ఈ వితరణ జరుగుతుంది. రసాయనాలతో తయారయ్యే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణం, జల వనరులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని నిర్వాహకులు కోరారు. భక్తులు, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మట్టి విగ్రహాలను ఉచితంగా తీసుకెళ్లి పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సిద్ధనాథ్ పిలుపునిచ్చారు.



## ఏడేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు ఆధార్

### ఎమ్మెల్యే చొరవతో బాలికకు భరోసా

ప్రొద్దుటూరులో ఏడేళ్లుగా ఆధార్ లేక సంక్షేమ పథకాలకు దూరమైన 12 ఏళ్ల నిరుపేద బాలికకు ఊరట లభించింది. 16వ వార్డు మోడంపల్లికి చెందిన రామాంజనేయులు--రామలక్ష్మి కుమార్తె పద్మ పుట్టుకతోనే అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైంది. ఆధార్ లేక ఎన్టీఆర్ భరోసా పింఛన్ సహా ప్రభుత్వ ప్రయోజనాలు అందక కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఇంటింటి పర్యటనలో బాలిక పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి వెంటనే స్పందించి అధికారులను ఆదేశించారు. ఆయన సూచనతో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్వయంగా బాలిక ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. అంగన్వాడీ సేవలు కూడా అందడం లేదని గుర్తించి వెంటనే బాలికను కేంద్రంలో చేర్పించారు. రెండో శనివారం అయినప్పటికీ ప్రత్యేక అనుమతి తీసుకుని కమిషనర్ తన కారులో కుటుంబాన్ని ఆధార్ కేంద్రానికి తీసుకెళ్లారు. దాదాపు నాలుగు గంటలపాటు శ్రమించి బయోమెట్రిక్, ఐరిస్, ఫొటో ప్రక్రియలను పూర్తి చేయించి ఆధార్ నమోదు విజయవంతం చేశారు. బాలికకు సదరం ధ్రువీకరణ చేయించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





# విద్యుత్ కోతలతో పంటలు భస్మం

### నాలుగు గ్రామాల రైతుల రోడ్డెక్కిన ఆగ్రహం

వనపర్తి సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ కోతలపై రైతులు భగ్గుమన్నారు. నాచహల్లి, క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం వనపర్తి–పెబ్బేరు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి రాకపోకలను స్తంభింపజేశారు. అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అసెంబ్లీలో రైతులకు 13 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడ్డారు.

ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి సబ్‌స్టేషన్ లాగ్‌బుక్‌ను పరిశీలించిన రైతులు, విద్యుత్ సరఫరా చేసిన సమయం కంటే ఎక్కువగా చూపిస్తూ తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల విద్యుత్ వచ్చేదని, ఇప్పుడు విద్యుత్ సరఫరా ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. ఏఈ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా రైతులు డీఈతో నేరుగా మాట్లాడాలని పట్టుబట్టారు.

దీంతో ఏఈ ఫోన్‌లో డీఈతో మాట్లాడించారు. పంటలు ఎండిపోకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే. మాణిక్యం, రఘువరన్ రెడ్డి, ధర్మనాయక్ సహా పలువురు నాయకులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



## తెలంగాణ విమోచన వీరుల స్మరణ

### అప్పంపల్లిలో అమరవీరులకు బీజేపీ ఘన నివాళి

తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలో బీజేపీ నేతలు అమరవీరులకు నివాళులర్పించారు. గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించిన వీరుల పోరాటాన్ని స్మరించుకున్నారు. 1947 అక్టోబర్ 7న బెల్లం నాగన్న నాయకత్వంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడుతూ 11 మంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆ వీరుల పోరాటానికి అప్పంపల్లిలోని రావి చెట్టు సజీవ సాక్ష్యంగా నిలిచిందని గుర్తుచేశారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణకు వెంటనే స్వేచ్ఛ లభించలేదని, సర్దార్ పటేల్ చేపట్టిన పోలీస్ చర్యతో సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు.



# రేవల్లిలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ భగ్గు

### దళితుల అవమానంపై భారీ ధర్నా

రేవల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్, దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు, కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితుల నిరసన తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ శనివారం భారీ ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంబీ సుల్తాన్ అలీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, దళితులు నిరసన తెలిపితే ఫామ్‌హౌస్ మైలపడిందంటూ పసుపు నీళ్లు చల్లడం దళిత సమాజాన్ని అవమానించడమేనని మండిపడ్డారు.

దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి పదవులు అనుభవించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు అదే వర్గాన్ని కించపరచడం దుర్మార్గమని విమర్శించారు. కేసీఆర్ గతంలో తొలి దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళిత బంధు వంటి హామీలు ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. దళితులను అవమానించిన బీఆర్ఎస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పర్వతాలు, బండారు శ్రీను, రాములు, రేవతి సురేష్ గౌడ్, కురుమయ్య, చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నేతలు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# 34% బీసీ రిజర్వేషన్లతో ఎన్నికల బరిలో

### చంద్రబాబు హామీ నిలబెట్టుకున్నారు: రాజగోపాల్

ప్రొద్దుటూరులో టీడీపీ నేతలు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఉన్న 24 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లతోనే టీడీపీ ప్రజల ముందుకు వస్తుందని స్పష్టం చేశారు. బీసీలు టీడీపీకి వెన్నెముక లాంటి వారని, రాబోయే ఎన్నికల్లో మరోసారి పార్టీని ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2029 ఎన్నికల్లోనూ కూటమి హవా కొనసాగుతుందన్నారు.

### ప్రొద్దుటూరు చైర్మన్ పదవి బీసీకే ఇవ్వాలి

బీసీ నాయకులు బొర్రా రామాంజనేయులు, భేపారి జాకీర్, పట్నం లక్ష్మణ్, నల్లబోతుల నాగరాజు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బీసీ జనాభా అధికంగా ఉన్నందున మున్సిపల్ చైర్మన్ టికెట్ బీసీ అభ్యర్థికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ అభ్యర్థిగా ఎవరొచ్చినా పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో చట్టసభల్లోనూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలు రాజకీయాలకు బ్యాక్‌బోన్ లాంటివారని పేర్కొంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా పనిచేస్తామని నేతలు ప్రకటించారు.



# ఆమె.. అతడా? అంతులేని మర్మం

## సెక్స్ అండ్ స్టాటిస్టిక్స్

### కోరికకు కొలమానం ఎక్కడా? వేల ఏళ్లుగా వెంటాడుతున్న ప్రశ్న

**ఒక గదిలో నిశ్శబ్దం... ఒక మనిషి మనసులో మాత్రం వెయ్యి ప్రశ్నలు. సెక్స్ గురించి రోజుకు ఎంత ఆలోచిస్తారు? ఎవరికి కోరిక ఎక్కువ? పురుషులకా.. మహిళలకా? ఎవరు ఎక్కువగా ఫాంటసీలు ఊహిస్తారు? ఎవరు ఏ విధంగా తృప్తి పొందుతారు? లైంగిక ఆనందం విషయంలో అసలు తేడా ఎక్కడుంది? ఈ ప్రశ్నలు వింటే ఇది ఒక సాధారణ చర్చలా అనిపించొచ్చు. కానీ తెర వెనుక చూస్తే ఇది మనిషి శరీరం, మెదడు, మనసు గురించి సాగుతున్న ఒక ఆసక్తికరమైన ప్రయాణం. వేల ఏళ్లుగా మనిషి సెక్స్‌ను అనుభవిస్తున్నాడు. కానీ "ఎవరిలో కోరిక ఎక్కువ?" అనే ప్రశ్నకు మాత్రం ఇప్పటికీ ఒక్క మాట సమాధానం లేదు. ఒకవైపు పురాతన గ్రంథాలు స్త్రీ లైంగిక ఆనందం గురించి ఆశ్చర్యకరమైన విషయాలు చెబుతున్నాయి. మరోవైపు ఆధునిక శాస్త్రం లక్షలాది మందిపై జరిగిన అధ్యయనాలను ముందుంచి మరో చిత్రం చూపిస్తోంది. అయితే ఈ రెండు కథల్లో నిజం ఏది..? కామానికి నిజంగా కొలమానం ఉందా..? కోరికకు లింగం ఉంటుందా..? లేక ప్రతి మనిషి కథే ఒక ప్రత్యేక గణాంకమా..? ఇప్పుడు తెరపైకి రాబోయేది... సంఖ్యల వెనుక దాగిన సెక్స్ కథ. తెరపై ఒక ప్రశ్న.. సమాధానం కోసం ప్రపంచం మనిషి పుట్టినప్పటి నుంచి అతనితో పాటు నడుస్తున్న ప్రశ్న ఇది. సెక్స్ కోరిక మగవారిలో ఎక్కువా? ఆడవారిలో ఎక్కువా? ఈ ప్రశ్నకు సమాధానం కోసం మనం ఆధునిక ప్రయోగశాలల నుంచి వేల ఏళ్ల నాటి గ్రంథాల వరకు వెళ్లాలి. అక్కడ ఒక ఆసక్తికరమైన నిజం కనిపిస్తుంది. మగవాడి కోరికకు ఒక కొలమానం, ఆడవారి కోరికకు మరో కొలమానం పెట్టడం సరైన పద్ధతి కాదు. ఆధునిక పరిశోధనలు చూస్తే సగటున పురుషుల్లో లైంగిక ఆలోచనలు, ఫాంటసీలు, కోరిక, హస్తప్రయోగం వంటి అంశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 2022లో ప్రచురితమైన ఒక పెద్ద మెటా-అనాలిసిస్ 211 అధ్యయనాలను, 6.21 లక్షల మందికి పైగా వ్యక్తుల సమాచారాన్ని పరిశీలించింది. అందులో సగటు స్థాయిలో పురుషుల లైంగిక కోరిక బలంగా ఉన్నట్టు తేలింది. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. సగటు అంటే ప్రతి వ్యక్తి కాదు. ఒక పురుషుడి కోరిక మరో పురుషుడి కంటే తక్కువగా ఉండొచ్చు. ఒక మహిళ కోరిక చాలా మంది పురుషుల కంటే ఎక్కువగా ఉండొచ్చు. వయసు, వ్యక్తిత్వం, సంబంధం, ఒత్తిడి, నిద్ర, మానసిక స్థితి, సామాజిక వాతావరణం.. ఇవన్నీ లైంగిక కోరికను మార్చగలవు. అందుకే "మగవాడికే కోరిక ఎక్కువ" అనడం ఎంత తప్పో, "ఆడవారికే కోరిక ఎక్కువ" అనడం కూడా అంతే తప్ప.**

**• కోరిక ఒకటే కాదు.. నాలుగు దశలు**

ఇక్కడ ఆధునిక సెక్సాలజీ ఒక ముఖ్యమైన పాఠం చెబుతుంది. కోరిక, ఉద్రేకం, శారీరక స్పందన, భావప్రాప్తి ఇవి అన్నీ ఒకటే కాదు. ఒక వ్యక్తికి సెక్స్ చేయాలనే కోరిక ఉండొచ్చు. కానీ ఆ సమయంలో శరీరం వెంటనే స్పందించకపోవచ్చు. మరో వ్యక్తికి శారీరక ఉద్రేకం కలగొచ్చు. కానీ మానసికంగా సెక్స్ కావాలనే కోరిక ఉండకపోవచ్చు. అలాగే భావప్రాప్తి జరిగినా సంబంధంలో భావోద్వేగ సంతృప్తి లేకపోవచ్చు. అందుకే "ఎవరిలో ఎక్కువ?" అనే ఒక్క ప్రశ్నతో మొత్తం లైంగికతను కొలవడం సాధ్యం కాదు. ఆధునిక పరిశోధనలు మాత్రం ఒక ముఖ్యమైన సగటు తేడాను చూపిస్తున్నాయి. పురుషుల్లో సెక్స్ గురించి ఆలోచించడం, లైంగిక ఫాంటసీలు కలగడం, లైంగిక కోరిక, హస్తప్రయోగం వంటి అంశాలు సగటున ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో మహిళల్లో లైంగిక ఆనందం తక్కువ అని చెప్పడానికి ఆధారం లేదు. అంతేకాదు, లైంగిక కోరిక కేవలం హార్మోన్ల ఆట కాదు. ప్రేమ, భద్రత, భాగస్వామిపై నమ్మకం, ఒత్తిడి, అలసట, శరీరం గురించి మన భావన, సంబంధంలోని అనుభవం ఇవన్నీ ప్రభావితం చేస్తాయి. ఒకరికి స్పర్శ కోరికను పెంచవచ్చు. మరొకరికి మాట. ఇంకొకరికి భావోద్వేగ అనుబంధం. ఇంకొకరికి ఊహ. మనిషి శరీరం ఒకే బటన్‌తో పనిచేసే యంత్రం కాదు. పురుషుల్లో టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లు ముఖ్యమైన పాత్ర పోషించినా, లైంగిక కోరికను హార్మోన్ ఒక్కటే నిర్ణయించదు. మహిళలలోనూ అదే నిజం. శరీరం, మెదడు, మనసు, సంబంధం అన్నీ కలిసి కోరికకు రూపం ఇస్తాయి.

**• కామసూత్రం చెప్పిన మరో కోణం**

ఇక్కడ చరిత్ర తెర మెల్లగా తెరుచుకుంటుంది. వేల సంవత్సరాల క్రితమే భారతీయ సమాజంలో స్త్రీ లైంగిక ఆనందం గురించి చర్చ జరిగింది. వాత్సాయనుడి కామసూత్రం అందుకు ముఖ్యమైన ఉదాహరణ. కామసూత్రాన్ని కేవలం శృంగార భంగిమల పుస్తకంగా చూడటం దాని అసలు భావాన్ని చాలా చిన్నదిగా చేయడం. అందులో ప్రేమ, ఆకర్షణ, వివాహం, సంబంధాలు, పురుషుడు స్త్రీ శారీరక స్వభావాలు, లైంగిక ఆనందం, సంతృప్తి వంటి అనేక అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీకి కూడా స్వతంత్ర లైంగిక కోరిక ఉందనే విషయాన్ని అది పరిగణనలోకి తీసుకుంది. స్త్రీకి ఉద్రేకం ఉంటుందని, ఆనందం ఉంటుందని, సంతృప్తి అవసరమని చర్చించింది. కొన్ని వ్యాఖ్యానాల్లో స్త్రీ కామోద్రేకాన్ని పురుషుడితో పోల్చి ఎక్కువగా పేర్కొన్న సందర్భాలు కనిపిస్తాయి. "స్త్రీకి పురుషుడి కంటే ఎనిమిది రెట్లు కోరిక" అనే మాట కూడా కొన్ని అనువాదాలు, భాష్యాల ద్వారా ప్రచారంలోకి వచ్చింది.

అయితే దీనిని ఆధునిక వైద్యశాస్త్రం కొలిచిన సంఖ్యగా చూడకూడదు. అది అప్పటి శారీరక సిద్ధాంతాలు, వ్యాఖ్యానాల నేపథ్యంలో చూడాల్సిన విషయం. కామసూత్రం నుంచి మనం తీసుకోవాల్సిన అసలు సందేశం ఆ ఎనిమిది అనే సంఖ్య కాదు. స్త్రీకి కూడా కోరిక ఉంది. ఆమెకు కూడా శారీరక ఆనందం అవసరం. ఆమె శరీరం కూడా స్పందిస్తుంది. వేల ఏళ్ల క్రితమే ఈ విషయాన్ని చర్చించడం ఆ కాలానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన సామాజిక దృశ్యం.



**• రాజు స్త్రీగా మారినప్పుడు**

అదే ఆలోచన భారతీయ పురాణ కథల్లో కూడా మరో రూపంలో కనిపిస్తుంది. భంగాశ్వనుడు అనే రాజుకు సంబంధించిన కథలో ఒక ఆసక్తికరమైన మలుపు ఉంటుంది. పురుషుడిగా జీవించిన రాజు స్త్రీగా మారి స్త్రీ అనుభవాన్ని పొందినట్టు కథ చెబుతుంది. ఈ కథకు సంబంధించిన సంప్రదాయ వ్యాఖ్యానాల్లో స్త్రీ లైంగిక ఆనందం పురుషుడి కంటే ఎక్కువగా ఉంటుందనే భావన కనిపిస్తుంది. ఈ కథను వైద్యపరమైన ఆధారంగా చూడలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాచీన భారతీయ ఊహాలోకంలో స్త్రీని కేవలం భార్యగా, తల్లిగా మాత్రమే చూడలేదు. ఆమెకు కూడా శరీరం ఉంది. ఆ శరీరానికి కోరిక ఉంది. ఆనందాన్ని అనుభవించే సామర్థ్యం ఉంది అనే ఆలోచన సాహిత్యంలో చోటు చేసుకుంది. అదే ప్రశ్నకు ప్రాచీన గ్రీకు పురాణం కూడా ఒక విచిత్రమైన సమాధానం ఇచ్చింది. జ్యూస్, హేరా మధ్య పురుషుడికి ఎక్కువ ఆనందమా? స్త్రీకి ఎక్కువ ఆనందమా? అనే వాదన వస్తుంది. పురుషుడిగానూ, స్త్రీగానూ జీవించిన అనుభవం ఉందని చెప్పబడే టైరేసియస్‌ను తీర్పు చెప్పమంటారు. కొన్ని ప్రాచీన రూపాల్లో లైంగిక ఆనందాన్ని పది భాగాలుగా ఊహించి, పురుషుడికి ఒక భాగం, స్త్రీకి తొమ్మిది భాగాలు అని చెబుతాడు. మరికొన్ని రూపాల్లో సంఖ్యలు వేరుగా ఉన్నాయి. అందుకే ఇది శాస్త్రీయ పరిశోధన కాదు. అది ఒక పురాణం. కానీ ఆ పురాణం చెప్పిన ఆలోచన మాత్రం ఆసక్తికరం స్త్రీకి లైంగిక ఆనందం తక్కువ కాదు.. మరింత ఎక్కువగా కూడా ఉండొచ్చని ఒక ప్రాచీన సమాజం ఊహించింది.

**• కోరికకు తాళం వేసిన చరిత్ర**

ప్రాచీన మెసపొటేమియా సాహిత్యంలోనూ ప్రేమ, లైంగికత, స్త్రీ కోరిక వంటి భావాలు కనిపిస్తాయి. దేవతల కథల్లో ప్రేమ, శారీరక సంబంధాలు, సంతానోత్పత్తి వంటి విషయాలు ప్రకృతి, వ్యవసాయం, జీవశక్తితో కలిపి చూపించారు. అంటే వేల సంవత్సరాల క్రితం లైంగికతను మనిషి జీవితానికి పూర్తిగా వేరైన నిషిద్ధ అంశంగా చూడలేదు. కానీ కాలం మారింది. సమాజపు నియమాలు మారాయి. ముఖ్యంగా యూరప్‌లో కొన్ని శతాబ్దాల తరువాత స్త్రీ లైంగికతపై కొత్త తాళాలు పడ్డాయి. స్త్రీకి కోరిక తక్కువ అని చెప్పిన సమాజమే, మరొక దశలో కోరిక ఎక్కువైతే ఆమెకు వ్యాధి ఉందని చెప్పింది. "నింఫోమేనియా" అనే పదంతో స్త్రీల అధిక లైంగిక కోరికను రుగ్మతగా వర్ణించిన వైద్య చరిత్ర ఉంది. 19వ శతాబ్దంలో కొంతమంది వైద్యులు స్త్రీ లైంగిక ప్రవర్తనను నియంత్రించేందుకు నేటి దృష్టిలో తీవ్రంగా తప్పైన చికిత్సలను కూడా సూచించారు. ఐజాక్ బేకర్ బ్రౌన్ వంటి వైద్యులు స్త్రీల లైంగిక ప్రవర్తనను నియంత్రించడానికి క్లిటోరిడెక్టమీ వంటి శస్త్రచికిత్సలను సమర్థించిన చరిత్ర ఉంది. ఇది ఎంత బాధాకరమైన నిజమంటే.. స్త్రీ శరీరంపై నియంత్రణను కొన్నిసార్లు వైద్యం పేరుతో కూడా అమలు చేశారు. ఒకప్పుడు "కోరిక లేదు" అన్నారు. ఇంకోసారి "కోరిక ఎక్కువైతే వ్యాధి" అన్నారు. రెండు సందర్భాల్లోనూ స్త్రీ కోరికను ఆమె స్వంత అనుభవంగా అర్థం చేసుకునే ప్రయత్నం తక్కువగానే జరిగింది.

**చివరి నిజం ఇదే**

అయితే వేల ఏళ్ల ప్రశ్నకు చివరికి శాస్త్రం ఇచ్చే సమాధానం ఏమిటి? సగటున పురుషుల్లో లైంగిక కోరిక ఎక్కువగా కనిపిస్తుంది. కానీ లైంగిక ఆనందంలో పురుషుడే గెలిచాడు, మహిళే గెలిచింది అని చెప్పే శాస్త్రీయ కొలమానం లేదు. ఇదే అసలు నిజం. ఒక మహిళ తన కోరికను బయటకు చెప్పకపోవడం ఆమెకు కోరిక లేదని అర్థం కాదు. సిగ్గు, కుటుంబ వాతావరణం, సామాజిక నియమాలు, సంబంధంలో భద్రత, వ్యక్తిగత అనుభవం ఇవన్నీ ఆమె తన కోరికను ఎలా వ్యక్తం చేస్తుందో ప్రభావితం చేయవచ్చు. ప్రాచీన భారతీయ గ్రంథాలు స్త్రీ ఆనందాన్ని గుర్తించాయి. గ్రీకు పురాణాలు దాన్ని మరింత ఎక్కువగా ఊహించాయి. మెసపొటేమియా సాహిత్యం స్త్రీ కోరికను తన కథల్లో దాచలేదు. తరువాతి శతాబ్దాలు దానికి తాళాలు వేశాయి. ఆధునిక శాస్త్రం మాత్రం ఆ తాళాలను ఒక్కొక్కటిగా తీస్తోంది. కామం పాపం కాదు. కోరిక అనారోగ్యం కాదు. లైంగికత మనిషి సహజ స్వభావంలో ఒక భాగం. అయితే ఆ కోరికకు అర్థం ఇచ్చేది బాధ్యత. దానికి అందం ఇచ్చేది పరస్పర గౌరవం. దానికి భద్రత ఇచ్చేది సమ్మతి. అందుకే "ఎవరిలో ఎక్కువ?" అనే ప్రశ్నకంటే "ఎలా ఉంటుంది?" అనే ప్రశ్న ముఖ్యం. పురుషుడిలో కోరిక ఉండొచ్చు. మహిళలోనూ ఉంటుంది. ఒకరిలో ఎక్కువగా ఉండొచ్చు. మరొకరిలో తక్కువగా ఉండొచ్చు. వయసుతో మారొచ్చు. జీవిత పరిస్థితులతో మారొచ్చు. సంబంధంతో మారొచ్చు. కామానికి లింగం ఉండొచ్చు.. కానీ దానికి ఒకే కొలమానం లేదు. వేల ఏళ్లుగా మనిషి వెతికిన సమాధానం చివరికి ఇదే.

**- హుస్సేన్**





# “పవర్”ఫుల్ పాజిషన్‌కు పావులు కదుపుతున్న పవన్

## తమ్ముడ్ని సీఎం చేయడమే అన్నయ్య విజన్ !?

**◆ చిరు ఆశయానికి జనసైనికుల సపోర్ట్**

**◆ తాజా పరిణామాలపై టీడీపీ హై అలర్ట్**

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూటమి అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి పీఠం చుట్టూ భవిష్యత్ సమీకరణాలపై చర్చ మొదలైంది. ప్రస్తుతం కూటమి రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ కీలక భాగస్వామిగా ఉన్నారు. అయితే భవిష్యత్‌లో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్న ఆకాంక్ష జనసేన కేడర్‌లో ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ ఆకాంక్ష కేవలం జనసేన కార్యకర్తల ఆలోచనకే పరిమితం కాకుండా, పార్టీకి అనుకూలంగా ఆలోచించే వర్గాల్లో కూడా బలపడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ సీఎం కావాలంటే ఆయన వ్యక్తిగత రాజకీయ బలం ఒక్కటే సరిపోదు.. విస్తృతమైన రాజకీయ సమీకరణ అవసరం అన్నది ఈ చర్చలో ప్రధాన అంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే చిరంజీవి పేరు మరోసారి రాజకీయ చర్చల్లోకి వస్తోంది. చిరంజీవి అధికారికంగా ఏ పార్టీలో లేరు. ప్రస్తుతం ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదనే స్థితి కొనసాగుతోంది. అయినప్పటికీ ఆయన రాజకీయంగా ఏదైనా నిర్ణయం తీసుకుంటే దాని ప్రభావం పవన్ కళ్యాణ్‌పై, జనసేనపై, కూటమి రాజకీయాలపై ఉంటుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కాపు సామాజిక వర్గంలో చిరంజీవికి ఉన్న గుర్తింపు, పవన్ కళ్యాణ్‌కు ఉన్న రాజకీయ ఆకర్షణ కలిస్తే అది భవిష్యత్ ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా మారుతుందన్న వాదన వినిపిస్తోంది. అందుకే పవన్ సీఎం కావాలన్న లక్ష్యానికి చిరంజీవి రాజకీయ ఎంట్రీ ఒక కీలక మలుపుగా మారుతుందా? అన్న ప్రశ్న ఇప్పుడు ఆసక్తిని పెంచుతోంది. తెరపైకి ఇంకా ఎలాంటి అధికారిక ప్రతిపాదన రాకపోయినా, తెరవెనుక ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయన్న ప్రచారం మాత్రం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. చిరంజీవి రాజకీయంగా తిరిగి వస్తే అది పవన్‌కు నేరుగా ఉపయోగపడుతుందా? లేక కుటుంబ రాజకీయాల ప్రభావం కూటమిలో కొత్త సమస్యలకు దారితీస్తుందా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.**





### • కాపు లాబీయిస్టుల తెరవెనుక స్కెచ్

చిరంజీవి రాజకీయాల్లోకి తిరిగి రావాలన్న ఆలోచన వెనుక కాపు లాబీయిస్టులు తెరవెనుక వ్యూహం సిద్ధం చేస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇది అధికారిక రాజకీయ నిర్ణయం కాదు. చిరంజీవికి అధికారిక ఆహ్వానం వచ్చిందన్న విషయం కూడా స్పష్టంగా లేదు. అయినా భవిష్యత్ రాజకీయాల్లో చిరంజీవి పాత్రను ఎలా ఉపయోగించుకోవచ్చు అనే అంశంపై కొందరు నేతలు, రాజకీయ మధ్యవర్తులు ఆలోచిస్తున్నారన్న చర్చ సాగుతోంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆయనకు రాజకీయంగా మరింత బలం పెంచాలంటే చిరంజీవి వంటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి తోడుగా ఉంటే ఉపయోగకరంగా ఉంటుందన్న అభిప్రాయం ఉంది. పవన్‌తో కలిసి చిరంజీవి పనిచేస్తే కుటుంబ బలం మాత్రమే కాదు.. రాజకీయంగా విస్తృత మద్దతు కూడగట్టే అవకాశం ఉంటుందన్న లెక్కలు వేస్తున్నారు. భవిష్యత్‌లో పవన్ కళ్యాణ్ సీఎం స్థాయికి ఎదగాలంటే ఆయన చుట్టూ బలమైన రాజకీయ వాతావరణం అవసరం. ఆ వాతావరణాన్ని నిర్మించడంలో చిరంజీవి పాత్ర ఉపయోగపడుతుందని భావించే వర్గాలు ఉన్నాయి. ముఖ్యంగా చిరంజీవి రాజకీయంగా యాక్టివ్ అయితే సీట్ల బార్గెయినింగ్ సమయంలో కూడా జనసేనకు అదనపు బలం రావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు జనసేనకు ఉన్న రాజకీయ ప్రాతినిధ్యాన్ని మించి భవిష్యత్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కోరేందుకు ప్రజాదరణ, సామాజిక సమీకరణాలు, కుటుంబ ప్రభావం వంటి అంశాలను ఉపయోగించుకోవచ్చన్నది ఈ లెక్కల వెనుక ఉన్న ఆలోచనగా చెబుతున్నారు. అయితే చిరంజీవి ఊరకే ఏ పార్టీలో చేరే అవకాశం లేదన్న అభిప్రాయం కూడా ఉంది. ఆయనకు రాజకీయంగా తిరిగి రావాల్సిన అవసరం ఏమిటి? వచ్చిన తర్వాత ఆయన పాత్ర ఏమిటి? ఆయనకు ఎలాంటి బాధ్యత ఇస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఉండాలి. అందుకే రాజ్యసభ అవకాశం, కేంద్ర మంత్రి పదవి వంటి ప్రతిపాదన ఉంటేనే రాజకీయాల్లోకి రీ ఎంట్రీపై ఆలోచించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అలాంటి అవకాశం లేకపోతే సినిమాల్లోనే కొనసాగడం మంచిదనే ఆలోచన కూడా ఆయన వైపు ఉండవచ్చన్న ప్రచారం ఉంది.

### • రాజకీయ రీ ఎంట్రీకి డీల్ ఇదేనా?

చిరంజీవి రాజకీయాల్లోకి మళ్లీ వస్తారన్న చర్చలో అత్యంత ఆసక్తికర అంశం రాజ్యసభ సీటు, కేంద్ర మంత్రి పదవి. ప్రస్తుతం ఇది అధికారికంగా ప్రకటించిన ప్రతిపాదన కాదు. రాజకీయ వర్గాల్లో సాగుతున్న చర్చ మాత్రమే. అయితే చిరంజీవిని తిరిగి రాజకీయాల్లోకి తీసుకురావాలంటే సాధారణంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే సరిపోదని, ఆయన స్థాయికి తగిన రాజకీయ బాధ్యత ఇవ్వాల్సి ఉంటుందన్న అభిప్రాయం ఉంది. ఒకవేళ రాజ్యసభకు పంపి, కేంద్రంలో మంత్రి పదవి ఇచ్చే స్థాయిలో రాజకీయ అవకాశం కల్పిస్తే చిరంజీవి మరోసారి రాజకీయాల్లోకి అడుగు పెట్టే అవకాశం ఉండొచ్చన్న చర్చ వినిపిస్తోంది. రాజకీయంగా గౌరవప్రదమైన స్థానం ఇస్తేనే రీ ఎంట్రీకి అర్థం ఉంటుందన్నది ఈ వాదనలో ప్రధాన అంశం. చిరంజీవి ఇప్పటికే ఒకసారి రాజకీయాల్లోకి వచ్చి పార్టీ స్థాపించిన అనుభవం ఉంది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల్లో ఆయన వెనక్కి తగ్గారు. ఇప్పుడు మళ్లీ రాజకీయాల్లోకి వస్తే అది కేవలం వ్యక్తిగత నిర్ణయం కాకుండా పవన్ కళ్యాణ్ భవిష్యత్ రాజకీయ ప్రయాణంతో ముడిపడే అవకాశం ఉంటుంది. చిరంజీవి జనసేనతో కలిసి పనిచేస్తే పవన్‌కు రాజకీయ బలం పెరుగుతుందని భావిస్తున్న వర్గాలు ఉన్నా, అదే సమయంలో చిరంజీవి అధికారికంగా పార్టీలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి చేరితే సీట్ల బార్గెయినింగ్‌లో జనసేన స్థానం బలపడొచ్చన్న అంచనా ఉంది. కూటమి రాజకీయాల్లో ప్రతి పార్టీ తనకు అనుకూలంగా ఎక్కువ సీట్లు కోరడం సహజం. జనసేన భవిష్యత్‌లో మరింత విస్తరించాలంటే ఆ పార్టీకి ప్రజాదరణతో పాటు బలమైన సామాజిక సమీకరణ అవసరం. చిరంజీవి రాజకీయంగా యాడ్ అయితే ఆ సమీకరణం మరింత ప్రభావవంతంగా మారుతుందని భావించే వర్గాలు ఉన్నాయి. అయితే ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. చిరంజీవి రాజకీయాల్లోకి వస్తే ఆయన ఏ పార్టీతో కలిసి పనిచేస్తారు? జనసేనలోనే చేరుతారా? లేక వేరే వేదికను ఎంచుకుంటారా? అన్నది ఇప్పటికీ స్పష్టత లేని అంశం. అందుకే చిరంజీవి రీ ఎంట్రీపై జరుగుతున్న చర్చ ప్రస్తుతం రాజకీయ అంచనాల స్థాయిలోనే ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిని ఖరారైన రాజకీయ వ్యూహంగా చూడలేం.

### •పవన్‌కు దారి ఇస్తారా? కూటమిలో ఉత్కంఠ

ఈ మొత్తం పరిణామంలో మరో కీలక అంశం టీడీపీ భవిష్యత్ నాయకత్వం. ముఖ్యంగా చంద్రబాబు తర్వాత ముఖ్యమంత్రి పీఠంపై ఆశగా ఉన్న నారా లోకేశ్‌కు పవన్ కళ్యాణ్ భవిష్యత్ సీఎం చర్చ సహజంగానే ఆసక్తికర అంశం. ప్రస్తుతం కూటమి కలిసి పనిచేస్తున్నా, భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో ఎవరి స్థానం ఎక్కడ ఉంటుందన్నది ఇంకా పూర్తిగా ఖరారు కాలేదు. పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నంతకాలం ఆయన సీఎం స్థాయి డిమాండ్‌ను పూర్తిగా పక్కన పెట్టడం సాధ్యమా? అన్న ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. జనసేన కేడర్‌లో పవన్‌ను సీఎం చేయాలన్న ఆకాంక్ష బలపడితే, భవిష్యత్‌లో ఆ డిమాండ్ రాజకీయ చర్చగా మారే అవకాశం ఉంటుంది. అదే సమయంలో లోకేశ్ తన రాజకీయ భవిష్యత్‌పై ఆశలు పెట్టుకున్న పరిస్థితిలో ఈ పరిణామం టీడీపీలో కూడా లెక్కలు మార్చగలదన్న అంచనాలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌కు రాజకీయంగా బలం పెరిగితే కూటమిలో ఆయన బేరసారాల శక్తి కూడా పెరుగుతుంది. అదే చంద్రబాబు కుటుంబ రాజకీయ వారసత్వానికి సంబంధించిన లెక్కలపై ప్రభావం చూపే అంశంగా మారవచ్చు. అందుకే చంద్రబాబు కూడా ఈ సమీకరణాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నారన్న ప్రచారం ఉంది. పవన్ కళ్యాణ్ కూటమిలో బలమైన భాగస్వామిగా ఉండటం ఒక విషయం. ఆయన భవిష్యత్‌లో స్వతంత్రంగా సీఎం స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష బలపడటం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడా రాజకీయంగా చాలా పెద్దది. పవన్‌కు ఎక్కువ రాజకీయ స్వేచ్ఛ వస్తే కూటమిలో సమీకరణాలు మారవచ్చు. పవన్ కళ్యాణ్ అదుపులో ఉండాలన్న ఆలోచన టీడీపీ వర్గీయుల్లో ఉందన్న ప్రచారం కూడా ఈ నేపథ్యంలోనే వినిపిస్తోంది. మరోవైపు లోకేశ్ భవిష్యత్ నాయకత్వంపై ఆశగా ఉన్న సమయంలో చిరంజీవి ఎంట్రీ అంశం తెరపైకి రావడం మరింత ఆసక్తి పెంచుతోంది. అన్నదమ్ములు ఇద్దరూ ఒకే రాజకీయ దిశలో కదిలితే వారి ప్రభావం పెరుగుతుందని ఒక వర్గం భావిస్తుంటే, అదే సమయంలో ఇద్దరి రాజకీయ బలం కలిస్తే కూటమిలో కొత్త శక్తి కేంద్రం ఏర్పడే అవకాశం ఉందని మరో వర్గం లెక్కలు వేస్తోంది. అందుకే ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ లోకేశ్ వర్గంలో కూడా ఉందన్న చర్చ సాగుతోంది.

### • చిరంజీవి చుట్టూ పార్టీల భిన్న లెక్కలు

చిరంజీవి రాజకీయ రీ ఎంట్రీపై బీజేపీ వైపు నుంచి సానుకూల సంకేతాలు ఉన్నాయన్న చర్చ కూడా ఈ సమీకరణానికి మరో కోణాన్ని తెస్తోంది. బీజేపీ వర్గాలు చిరంజీవిని స్వాగతించే ధోరణిలో ఉన్నాయన్న ప్రచారం ఉంది. చిరంజీవికి ఉన్న ప్రజాదరణ, ఆయనకు ఉన్న విస్తృత గుర్తింపు, దక్షిణాదిలో ఆయనకు ఉన్న పరిచయం వంటి అంశాలు కేంద్ర రాజకీయాల్లో ఉపయోగపడతాయని భావించే అవకాశం ఉంది. ఒకవేళ చిరంజీవికి రాజ్యసభ అవకాశం కల్పించి, కేంద్ర స్థాయిలో బాధ్యత ఇస్తే ఆయనను మరోసారి క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావచ్చన్న చర్చకు కూడా ఇది బలం ఇస్తోంది. అయితే మరోవైపు వైసీపీ వైఖరి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోందన్న అభిప్రాయం ఉంది. చిరంజీవిపై వైసీపీ నుంచి ప్రస్తుతం పెద్దగా రాజకీయ వ్యాఖ్యలు వినిపించడం లేదు. గతంలో చిరంజీవికి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించిందన్న భావన వారిలో ఉంది. అయినప్పటికీ చివరి దశలో చిరంజీవి తమకు రాజకీయంగా నష్టం చేశారన్న భావనను కొందరు నేతలు అనేక సార్లు వ్యక్తం చేశారు కూడా. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన సందర్భాల్లో చిరంజీవి నుంచి వచ్చిన స్పందనలు, స్పందించని సందర్భాలు రాజకీయంగా ఎలా ప్రభావితం చేశాయన్న దానిపై వైసీపీలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది. పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఓవరాక్షన్ చేసినా.. వైసీపీ ప్రభుత్వంలో తనకు గౌరవం లభించిందని చిరంజీవి అప్పట్లో స్పష్టంగా చెప్పి ఉంటే పరిస్థితి కొంత భిన్నంగా ఉండేదన్న అభిప్రాయం ఫ్యాన్ పార్టీ నేతల్లో ఉందని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నష్టం జరుగుతున్నప్పుడు చిరంజీవి మౌనంగా ఉండటం ఒక అంశంగా కనిపించిందని, తర్వాత జగన్ హయాంలో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి నష్టం జరగలేదని ఆయన చెప్పడం ముందుగానే జరిగి ఉంటే బాగుండేదన్న భావన కూడా ఉందని ప్రచారం. అందువల్ల ఇప్పుడు చిరంజీవి రాజకీయాల్లోకి వస్తే వైసీపీ ఆయనను ఎలా చూస్తుంది? బీజేపీతో ఆయనకు సాన్నిహిత్యం పెరిగితే వైసీపీ స్పందన ఎలా ఉంటుంది? అన్నది కూడా భవిష్యత్‌లో కీలకంగా మారే అవకాశం ఉంది.



### • ఒక్కటైతే బలం.. అదే పెద్ద సమస్యా?

మొత్తంగా చూస్తే చిరంజీవి రాజకీయాల్లోకి తిరిగి రావాలన్న చర్చ వెనుక పవన్ కళ్యాణ్ భవిష్యత్ రాజకీయ లక్ష్యం, జనసేన విస్తరణ, కూటమిలో సీట్ల బార్గెయినింగ్, కాపు సామాజిక సమీకరణం, బీజేపీ ఆసక్తి, టీడీపీ నాయకత్వ లెక్కలు అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు చిరంజీవి అధికారికంగా రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఎలాంటి ప్రకటన లేదు. జనసేన నుంచి రాజ్యసభకు పంపడం, కేంద్ర మంత్రి పదవి ఇవ్వడం వంటి అంశాలు కూడా అధికారిక నిర్ణయాలుగా లేవు. ఇవన్నీ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాలు మాత్రమే. అయినప్పటికీ ఈ చర్చకు కారణం పవన్ కళ్యాణ్ భవిష్యత్ సీఎం ఆకాంక్ష. పవన్‌ను సీఎం చేయాలంటే జనసేనకు ప్రస్తుతం ఉన్న బలాన్ని మించి విస్తృతమైన రాజకీయ బలం అవసరం అన్న భావన ఈ మొత్తం చర్చకు కేంద్ర బిందువుగా మారింది. ఆ బలాన్ని చిరంజీవి అందించగలరా? అన్నది ప్రధాన ప్రశ్న. చిరంజీవి యాడ్ అయితే జనసేనకు సీట్ల బార్గెయినింగ్‌లో అదనపు బలం వస్తుందా? కూటమిలో పవన్ స్థానం మరింత బలపడుతుందా? లోకేశ్ భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై దాని ప్రభావం ఉంటుందా? చంద్రబాబు దీనిని ఎలా సమతుల్యం చేస్తారు? బీజేపీ చిరంజీవిని తమ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందా? అన్న ప్రశ్నలకు ఇప్పుడే సమాధానం లేదు. అయితే చిరంజీవి, పవన్ ఇద్దరూ ఒకే రాజకీయ వేదికపై కనిపిస్తే ఆ ప్రభావం కేవలం జనసేనకు మాత్రమే పరిమితం కాకపోవచ్చు. కూటమి రాజకీయాల్లో కొత్త బేరసారాలకు అది దారి తీయొచ్చు. అదే సమయంలో అన్నదమ్ములిద్దరూ ఒకే దిశలో బలంగా నిలబడితే తమ రాజకీయ నియంత్రణ తగ్గుతుందన్న ఆందోళన కూటమిలోని ఇతర భాగస్వాములకు కలగవచ్చన్న చర్చ కూడా ఉంది. అందుకే ఒకవైపు పవన్ బలం పెరగడం జనసేనకు శుభసూచకం. మరోవైపు అదే బలం కూటమి నాయకత్వ లెక్కలను క్లిష్టం చేసే అవకాశం కూడా ఉంది. చిరంజీవి రీ ఎంట్రీ నిజంగా జరిగితే అది ఒక వ్యక్తి రాజకీయాల్లోకి రావడం మాత్రమే కాదు.. ఏపీ కూటమి భవిష్యత్ సమీకరణాలను పరీక్షించే పరిణామంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాత్రం అధికారిక నిర్ణయాల కంటే తెరవెనుక చర్చలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. చిరంజీవి ఏ నిర్ణయం తీసుకుంటారు? పవన్ సీఎం అంశంపై జనసేన భవిష్యత్‌లో ఎలాంటి అడుగు వేస్తుంది? చంద్రబాబు, లోకేశ్ ఎలా స్పందిస్తారు? బీజేపీ పాత్ర ఎంతవరకు ఉంటుంది? అనే ప్రశ్నలతో ఏపీ రాజకీయాల్లో ఆసక్తి కొనసాగుతోంది. అన్నయ్య ఎంట్రీ.. తమ్ముడి సీఎం కల.. కూటమి భవిష్యత్ లెక్కలు ఇప్పుడు ఒకే రాజకీయ చర్చగా మారుతున్నాయి.



# బీసీలు బోయిలేనా?

# అధికార పీఠం కలేనా?

## బడుగు వర్గాలు రాజకీయ పావులేనా..? • ఈసారైనా అమీతుమీ తేలేనా?

## అధికార పీఠంపై 'బీసీ'రియస్ • చిట్టా విప్పుతున్న చిరంజీవులు

## • అగ్రవర్ణాల్లో మొదలైంది దిగులు

తెలంగాణ రాష్ట్రం బహుజనుల త్యాగాలతో ఏర్పడింది. కానీ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం ఎందుకు తగ్గుతోంది? జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అధికారంలో వాటా ఎందుకు కనిపించడం లేదు? ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, పద్మశాలి, రజక, కుర్మ, ఇతర బీసీ వర్గాలకు రాజకీయ గుర్తింపు ఎక్కడ? ఐదు మంత్రులతో మొదలైన ప్రాతినిధ్యం.. నాలుగు, మూడు, రెండు అంటూ తగ్గిపోవడం ఏ సామాజిక న్యాయానికి సంకేతం? లక్షల జనాభా ఉన్న కులాలకు మంత్రి పదవులు దక్కకపోతే.. తక్కువ జనాభా ఉన్న వర్గాలకు పదే పదే అవకాశాలు ఎందుకు? ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు, బడ్జెట్ కేటాయింపుల్లో బీసీల వాటా ఎక్కడ? ఓటు వేసే సమయంలో బీసీలు కీలకం.. అధికారం పంచుకునే సమయంలో మాత్రం ఎందుకు కనిపించరు? ఇదే ప్రశ్నను ప్రభుత్వ పెద్దలను నిలదీస్తూ బీసీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షులు టి. చిరంజీవులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులదే అంటూ బీసీ వర్గాలను రాజకీయంగా చైతన్యపరచాలని ఆయన పిలుపునిచ్చారు.

Table 1

2014 నుండి నేటి వరకు ఏర్పాటైన మంత్రిమండలి – సామాజిక వర్గాల వారిగా ప్రాతినిధ్యం

| S.No | సామాజిక వర్గం | 2014 | 2018 | 2023 | Remarks | Total | % of Cabine | Population % |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | రెడ్డి (Reddy) | 6 | 6 | 4 | ప్రస్తుత ముఖ్య మంత్రి | 16 | 29.62 | 4.8 % |
| 2 | వెలమ (Velama) | 4 | 4 | 1 | రెండు సార్లు ముఖ్య మంత్రి | 9 | 16.66 | 0.4% |
| 3 | కమ్మ | 1 | 1 | 1 | – | 3 | 5.55 | 1.03 % |
| 4 | బ్రాహ్మణ | – | – | 1 | – | 1 | 1.85 | 0.94 |
| 5 | షెడ్యూలు కులాలు | 1 | 1 | 4 | రెండుసార్లు డిప్యూటీ సీఎంలు | 6 | 11.11 | 17.43 |
| 6 | షెడ్యూలు తెగలు | 1 | 1 | 1 | – | 3 | 5.5 | 10.45 |
| 7 | ముస్లిం (OC) | 1 | 1 | 1 | రెండుసార్లు డిప్యూటీ సీఎంలు | 3 | 5.5 | 2.48 |
| 8 | బీసీ | 4 | 3* | 2** | | 9 | 16.66 | 56.33 |
| 9 | ఇతర (Others) | – | – | – | – | – | – | – |
| 10 | ఖాళీలు | – | 1 | 3 | – | 4 | 7.4 | – |
| 11 | మొత్తం (Total) | 18 | 18 | 18 | – | 54 | 100 | – |

Note: *ఈటెల రాజేందర్ తొలగింపు తర్వాత ** కొండా సురేఖ తొలగింపు తర్వాత

Table 2

MLA's in TELANGANA

| S.No | సామాజిక వర్గం | 2009 | 2014 | 2018 | 2023 |
|---|---|---|---|---|---|
| 1 | రెడ్డి (Reddy) | 41 | 42 | 39 | 43 |
| 2 | వెలమ (Velama) | 10 | 10 | 10 | 13 |
| 3 | కమ్మ | 5 | 5 | 5 | 4 |
| 4 | బ్రాహ్మణ | 2 | 2 | 2 | 1 |
| 5 | వైశ్య | - | 1 | 1 | 1 |
| 6 | షెడ్యూలు కులాలు | 19 | 19 | 19 | 19 |
| 7 | షెడ్యూలు తెగలు | 12 | 123 | 12 | 12 |
| 8 | ముస్లిం | 0.7 | 8 | 8 | 7 |
| 9 | బీసీ | 23 | 20 | 23 | 19 |
| 10 | మొత్తం (Total) | 119 | 119 | 119 | 119 |

Table 3

2009 నుంచి 2023 బీసీ MLA లు కులాల వారిగా

| | 2009 | 2014 | 2018 | 2023 |
|---|---|---|---|---|
| మున్నూరుకాపు | 9 | 7 | 9 | 3 |
| ముదిరాజ్ | 2 | 1 | 1 | 1 |
| గౌడ | 5 | 5 | 4 | 4 |
| యాదవ | 2 | 2 | 5 | 1 |
| పద్మశాలి | 3 | 2 | 0 | 2 |
| కురుమ | - | - | - | 1 |
| పెరిక | 1 | 1 | 1 | 1 |
| బొందిలి | - | 1 | 1 | 2 |
| రజక | 1 | - | - | 1 |
| వంజరా | - | - | 1 | 1 |
| ఆరె మరాఠి | - | - | - | 1 |
| విశ్వకర్మ | - | 1 | - | - |
| గంగపుత్ర | - | - | 1 | 1 |
| మొత్తం | 23 | 20 | 23 | 19 |

Table 4

రాజ్యసభ మొత్తం స్థానాలు (7)
As on 10-09-2026

| S.No | సామాజిక వర్గం | |
|---|---|---|
| 1 | రెడ్డి (Reddy) | 2 |
| 2 | వెలమ (Velama) | 1 |
| 3 | కమ్మ | 1 |
| 6 | షెడ్యూలు కులాలు | - |
| 7 | షెడ్యూలు తెగలు | - |
| 8 | ముస్లిం | - |
| 9 | ఇతరులు * | 1 |
| 10 | బీసీ | 2 |
| 11 | మొత్తం | 7 |

* ఇతర రాష్ట్రాల బ్రాహ్మణుడు

Table 5

లోకసభ 2009 నుంచి నేటి వరకు మొత్తం స్థానాలు (17)

| S.No | సామాజిక వర్గం | 2009 | 2014 | 2019 | 2024 |
|---|---|---|---|---|---|
| 1 | రెడ్డి (Reddy) | 3 | 5 | 7 | 6 |
| 2 | వెలమ (Velama) | 1 | 3 | - | 1 |
| 3 | కమ్మ | 1 | - | 1 | - |
| 6 | షెడ్యూలు కులాలు | 4 | 3 | 3 | 3 |
| 7 | షెడ్యూలు తెగలు | 2 | 2 | 2 | 2 |
| 8 | ముస్లిం | 1 | 1 | 1 | 1 |
| 9 | ఇతరులు * | 1 | - | - | - |
| 10 | బీసీ | 4 | 3 | 3 | 4 |
| 11 | మొత్తం | 17 | 17 | 17 | 17 |

* విజయశాంతి కులం తెలియదు

Table 6

MLC ల ప్రాతినిధ్యం సామాజిక వర్గాల వారిగా
తేది:10-09-2026

| S.No | సామాజిక వర్గం | ప్రస్తుత |
|---|---|---|
| | మొత్తం 40, ఖాళీ 1, ప్రస్తుతం 39 | |
| 1 | రెడ్డి (Reddy) | 13 |
| 2 | వెలమ (Velama) | 3 |
| 3 | కమ్మ | 1 |
| 4 | బ్రాహ్మణ | 3 |
| 5 | వైశ్య | 1 |
| 6 | షెడ్యూలు కులాలు | 3 |
| 7 | షెడ్యూలు తెగలు | 1 |
| 8 | ముస్లిం | 3 |
| 9 | ఇతరులు | 1 |
| 10 | బీసీ | 10* |
| | మొత్తం (Total) | 39 |

*మున్నూరుకాపు (2), విశ్వకర్మ (2), పద్మశాలి (1), ముదిరాజ్ (1) యాదవ (1), గౌడ (1), రజక (1), ఆరె (1)

* శాసనసభలో తగిన ప్రాతినిధ్యానికి దూరంగా ఉన్నారు;
* లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారు;
* ఎమ్మెల్సీలలో కూడా తీవ్రంగా నష్టపోతున్నారు;
* మంత్రివర్గంలో జనాభా నిష్పత్తికి అనుగుణమైన ప్రాతినిధ్యం కనిపించడం లేదు.

జనాభాలో మెజారిటీ...అధికారంలో మైనారిటీ!
ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు.
ఇది రాజకీయ న్యాయం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యానికి సంబంధించిన ప్రశ్న.

### త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ.. అధికారం మాత్రం దూరం

తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక బహుజనుల పాత్రను విస్మరించలేమని టి. చిరంజీవులు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ తొలిదశలో సుమారు 600 నుంచి 700 మంది అమరులయ్యారని, మలిదశ ఉద్యమంలో 1,200 నుంచి 1,400 మంది వరకు బలిదానాలు చేశారని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా దాదాపు 2,000 మంది బహుజన బిడ్డల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. అలాంటి రాష్ట్రంలోనే బహుజనులు రాజకీయ అధికారానికి ఎందుకు దూరమవుతున్నారు? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారిందన్నారు. తెలంగాణ కోసం రక్తం చిందించిన కుటుంబాలకు, ఉద్యమంలో ముందుండి పోరాడిన సామాజిక వర్గాలకు, రాష్ట్ర పరిపాలనలో నిర్ణయాధికారం దక్కకపోతే రాష్ట్ర సాధన ఫలితం ఎవరికి దక్కిందన్న చర్చ తప్పదని అన్నారు. ఈ అంశంపైనే బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని సమీక్షించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఇది రాజకీయ ఉపన్యాసం కాదని, ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్ ఆధారంగా బీసీల పరిస్థితిని ప్రజల ముందుంచే ప్రయత్నమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీసీలకు వచ్చిన రాజకీయ అవకాశాలు పెరగాల్సిందిపోయి తగ్గుతున్నాయన్నది గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. అందుకే బీసీ సమాజం ఇక కేవలం ఓటు బ్యాంకుగా ఉండకుండా అధికార భాగస్వామ్యం కోసం ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు.

### ఎమ్మెల్యేలు ఉన్నా.. విస్తరణ ఎందుకు లేదు?

మంత్రివర్గంతో పాటు శాసనసభలోనూ బీసీల పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని చిరంజీవులు గణాంకాలతో వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 2009లో బీసీ ఎమ్మెల్యేల సంఖ్య 23గా ఉందని, 2014లో అది 20కి చేరిందని, 2018లో మళ్లీ 23కు పెరిగిందని, 2023 నాటికి 19కి తగ్గిందని తెలిపారు. ఉపఎన్నికలో ఒక యాదవ అభ్యర్థి గెలవడంతో సంఖ్య 20కి చేరినా, తన గణాంకాలను 2023 ఎన్నికల ఫలితాల ఆధారంగా 19గా పరిగణిస్తున్నామన్నారు. "56 శాతం జనాభా ఉన్న బీసీలకు శాసనసభలో రాజకీయ ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తికి ఎందుకు చేరడం లేదు?" అని ప్రశ్నించారు. బీసీ ఎమ్మెల్యేలు ఉన్నా వారిలో కొన్ని కులాలకే ప్రాతినిధ్యం పరిమితమవుతోందని, పెద్ద సంఖ్యలో ఉన్న అనేక బీసీ వర్గాలు రాజకీయంగా ఖాళీగా మిగిలిపోతున్నాయని అన్నారు. లోకసభలో తెలంగాణకు 17 స్థానాలు ఉంటే బీసీలకు నాలుగు స్థానాలు ఉన్నాయని, రాజ్యసభలో రాష్ట్రానికి చెందిన సభ్యుల్లో బీసీలకు రెండు స్థానాలు ఉన్నాయని వివరించారు. ఎమ్మెల్సీల విషయానికి వస్తే మొత్తం 40 స్థానాల్లో ప్రస్తుతం 39 స్థానాలు ఉన్నాయని, అందులో బీసీ ఎమ్మెల్సీలు 10 మంది ఉన్నారని చెప్పారు. ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యే పరిస్థితి ఉందని, వాటిలో మూడు గవర్నర్ కోటా స్థానాలు, రెండు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలకు సంబంధించిన స్థానాలు ఖాళీ కానున్నాయని వివరించారు. "ఈ ఐదు స్థానాలు ఎవరికి ఇస్తారు? బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలకు ఈ అవకాశాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందా?" అంటూ ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం లేని బీసీ వర్గాలకు ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పోస్టుల ద్వారా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారంలో భాగస్వామ్యం లేకుండా బీసీల అభివృద్ధి సాధ్యమేనా అన్నది పాలకులు ఆలోచించాలని సూచించారు.

"25 లక్షల జనాభా ఉన్న యాదవులకు మంత్రి పదవి లేదని.. లక్షా 40 వేల జనాభా ఉన్న వర్గాలకు మాత్రం పదే పదే అవకాశాలు ఎందుకు?" అంటూ చిరంజీవులు సూటిగా నిలదీశారు. గౌడ సామాజిక వర్గానికి సుమారు 16.30 లక్షల జనాభా ఉందని, కేవలం ఒక్క పొన్నం ప్రభాకర్‌కు మాత్రమే మంత్రి పదవి లభించిందని తెలిపారు. మున్నూరు కాపులకు సుమారు 13.75 లక్షల జనాభా ఉన్నా మంత్రి పదవి ఎక్కడుందని ప్రశ్నించారు. పద్మశాలీలు, చేనేత వర్గాలు కలిపి సుమారు 13.5 లక్షల జనాభా ఉన్నప్పటికీ వారికి మంత్రి పదవి లేదన్నారు. రజకుల

### లక్షల జనాభా ఉన్నా.. మంత్రి పదవి ఏదీ?

జనాభా కూడా దాదాపు 9.95 లక్షలు ఉన్నా మంత్రివర్గంలో వారి ప్రాతినిధ్యం కనిపించడం లేదన్నారు. "మా జనాభా, జనాభా కాదా? మేము ఓట్లు వేయడానికేనా?" అంటూ బీసీ సమాజం తరపున ప్రశ్నించారు. మున్నూరు కాపులు, పద్మశాలీలు, రజకులు, కురుమలు, నాయీ బ్రాహ్మణులు, వడ్డెరలు, శాలివాహనులు వంటి అనేక బీసీ వర్గాలు తమ తమ స్థాయిలో సంఘటితమై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. తమకు ఇతర సామాజిక వర్గాల వాటా ఇవ్వాలని అడగడం లేదని, జనాభా పరంగా తమకు రావాల్సిన న్యాయమైన రాజకీయ భాగస్వామ్యం మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. ఇది పదవి కోసం చేసే పోరాటం కాదని, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం చేసే పోరాటమని పేర్కొన్నారు.




### ఐదుగురి నుంచి ఇద్దరికి.. ఇదేనా బీసీ గౌరవం?

బీసీల రాజకీయ ప్రాతినిధ్యం ఏ స్థాయికి పడిపోయిందో మంత్రివర్గ గణాంకాలే చెబుతున్నాయని చిరంజీవులు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో 35 మంది మంత్రులు ఉన్నారని, వారిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన 13 మందిలో ఐదుగురు బీసీలకు అవకాశం లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిస్థితి మెరుగుపడుతుందని భావించినా 2014లో బీసీ మంత్రుల సంఖ్య నాలుగుకు తగ్గిందన్నారు. అదే సమయంలో బీసీలకు శాసనసభ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్ వంటి కీలక పదవులు దక్కిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. 2018 నాటికి బీసీ మంత్రుల సంఖ్య మూడుకు పడిపోయిందని... ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఆ సంఖ్య మరింత తగ్గిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2025లో కొండా సురేఖను తప్పించడంతో బీసీ మంత్రుల సంఖ్య రెండుకు చేరింది. ఐదు.. నాలుగు.. మూడు.. రెండు.. ఇదే కొనసాగితే ఒకటికి, చివరకు సున్నాకు చేరే పరిస్థితి రాదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం 15 మంది మంత్రులు ఉన్న మంత్రివర్గంలో మూడు ఖాళీలు ఉన్నాయని, సామాజిక వర్గాల వారీగా చూస్తే రెడ్లకు నాలుగు, వెలమకు ఒకటి, కమ్మకు ఒకటి, బ్రాహ్మణులకు ఒకటి, ఎస్సీలకు నాలుగు, ఎస్టీలకు ఒకటి, ముస్లింలకు ఒకటి, బీసీలకు రెండు స్థానాలు ఉన్నాయని వివరించారు. 56 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం ఇద్దరు మంత్రులే ఉండటం ఏ సామాజిక న్యాయం? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనాభా పరంగా చూస్తే ముదిరాజ్‌లు సుమారు 26-27 లక్షలు, యాదవులు సుమారు 25 లక్షలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అయినా ఈ రెండు పెద్ద సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడమేంటని నిలదీశారు. లక్షకు పైగా జనాభా ఉన్న చిన్న వర్గాలకు వరుసగా అవకాశాలు వస్తున్నప్పుడు, లక్షల సంఖ్యలో ఉన్న బీసీ వర్గాలకు ఎందుకు అవకాశాలు రావడం లేదని ప్రశ్నించారు.

### ఖమ్మంలో బీసీలకు రాజకీయ తలుపులు మూసేశారా?

జిల్లాల వారీగా బీసీ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తుందని చిరంజీవులు వివరించారు. 2023 గణాంకాల ప్రకారం 19 మంది బీసీ ఎమ్మెల్యేలలో హైదరాబాద్‌లో ఐదుగురు ఉన్నారని, తరువాత ఉపఎన్నికలో గెలిచిన నవీన్ యాదవ్‌ను కలుపుకుంటే హైదరాబాద్‌లో ఆ సంఖ్య ఆరుగురికి చేరుతుందని చెప్పారు. రంగారెడ్డిలో ముగ్గురు, మెదక్‌లో ఒకరు, మహబూబ్‌నగర్‌లో ఇద్దరు, నల్గొండలో ఒకరు, వరంగల్‌లో ఒకరు, కరీంనగర్‌లో నలుగురు, ఆదిలాబాద్‌లో ఇద్దరు ఉన్నారని వివరించారు. నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో పరిస్థితి బీసీలకు అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే ఒక్క బీసీ ఎమ్మెల్యే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వనమా వెంకటేశ్వరరావు ఒక్కరే ఆ ప్రాతినిధ్యానికి ఉదాహరణగా మిగిలారని చెప్పారు. ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలు ఉంటే ఏడు రిజర్వ్‌డ్ స్థానాలని, మిగిలిన మూడు స్థానాల్లో కూడా బీసీలకు ప్రాతినిధ్యం లేకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభలోనూ బీసీలకు ప్రాతినిధ్యం లేదని, ఎమ్మెల్సీ స్థానంలోనూ బీసీలకు అవకాశం లేదని, రాజ్యసభ ప్రాతినిధ్యం పైనా ఇదే పరిస్థితి ఉందని అన్నారు. "ఖమ్మంలో బీసీలే లేరా? 44 శాతం వరకు బీసీ జనాభా ఉన్న ప్రాంతంలో ఒక్క ఎమ్మెల్యే సీటు లేదు.. ఒక్క ఎమ్మెల్సీ సీటు లేదు.. లోక్‌సభ సీటు లేదు.. రాజ్యసభలోనూ ప్రాతినిధ్యం లేదు. మరి బీసీలు ఎందుకు ఓటేయాలి? ఎవరిని గెలిపించడానికి ఓటేయాలి?" అంటూ ఆయన నిలదీశారు. ఒక సామాజిక వర్గం రాజకీయంగా గుర్తించబడకపోతే, ఆ వర్గం కూడా తమకు గుర్తింపు ఇవ్వని రాజకీయ వ్యవస్థను ఎందుకు గుర్తించాలని ప్రశ్నించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి బీసీ పౌరుడు ఈ ప్రశ్నను తనలో తాను వేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు.

### ఓటు కాదు.. అధికారంలో వాటా కావాలి

బీసీ సమస్య కేవలం మంత్రి పదవుల సంఖ్యతో ముగిసేది కాదని, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ స్థానాలు, బడ్జెట్ కేటాయింపులు, కార్పొరేషన్ల నిధులు, పరిపాలనా నిర్ణయాధికారంలోనూ బీసీలకు తగిన భాగస్వామ్యం ఉండాలని చిరంజీవులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి దశల్లో బీసీ కార్పొరేషన్‌కు కొంత నిధుల కేటాయింపు జరిగేదని, ప్రస్తుతం గత రెండేళ్లు తొమ్మిది నెలలుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఇది ఒక్క ప్రభుత్వం చేసిన అన్యాయం కాదని, అన్ని ప్రభుత్వాలు బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యమాలు ఎన్నో జరుగుతున్నా వాటి తుది లక్ష్యం రాజకీయ అధికారంలో జనాభా నిష్పత్తికి తగిన భాగస్వామ్యం కావాలని అన్నారు. "మా కోటా మాకు ఇవ్వండి.. మీ కోటా మాకు ఇవ్వండి అని మేము అడగడం లేదు. మా జనాభాకు తగిన న్యాయమైన వాటా మాకు కావాలి. అది మా ఆత్మగౌరవం. అది మా అస్తిత్వం" అన్నది ఆయన ప్రధాన డిమాండ్‌గా నిలిచింది. బీసీ వర్గాలు ఇక విడివిడిగా కాకుండా తమ తమ కమ్యూనిటీల్లో సమావేశాలు నిర్వహించి రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించాలని పిలుపునిచ్చారు. యాదవులు, ముదిరాజ్‌లు, మున్నూరు కాపులు, గౌడలు, పద్మశాలీలు, రజకులు, కురుమలు, నాయీ బ్రాహ్మణులు, వడ్డెరలు, ఇతర బీసీ వర్గాలు తమ జనాభా, రాజకీయ ప్రాతినిధ్యం, పదవులు, నిధులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. "మా అస్తిత్వాన్ని మీరు గుర్తించకపోతే.. మేమెందుకు మిమ్మల్ని గుర్తించాలి? మాకు రాజకీయ భాగస్వామ్యం ఇవ్వకపోతే.. మీ రాజకీయ వ్యవస్థలో మేమెందుకు భాగస్వామ్యం కావాలి?" అన్న ప్రశ్నను పాలకుల ముందుంచారు. బీసీలకు న్యాయం చేయాలంటే మాటలకే పరిమితం కాకుండా స్పష్టమైన రాజకీయ భాగస్వామ్య విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గణాంకాలతో మాట్లాడుతున్నామని, తమ వద్ద ఉన్న వివరాలు ఆధారాలతో ఉన్నాయని స్పష్టం చేశారు. 56 శాతం బీసీ జనాభాకు రాజకీయ అధికారంలో తగిన వాటా దక్కే వరకు ప్రశ్నించే గొంతు ఆగదని ప్రభుత్వ పెద్దలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. ఓటు వేసే ప్రజలుగా మాత్రమే కాకుండా, పాలించే హక్కు ఉన్న పౌరులుగా బీసీలను చూడాల్సిన సమయం వచ్చిందని చిరంజీవులు తేల్చిచెప్పారు.





# ఇంగ్లండ్ దూకుడు.. పాక్‌కు వైట్‌వాష్ షాక్!

## రూట్ మెరుపులు.. ఎడ్జ్‌బాస్టన్‌లో అదిరిపోయే ముగింపు

ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌కు మరోసారి షాక్ ఇచ్చిన ఇంగ్లండ్.. మూడు టెస్టుల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసి అదరగొట్టింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు తొలి ఓవర్‌లోనే బెన్ డకెట్ , ఎమిలియో గే వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. అయితే అక్కడి నుంచి జో రూట్ తన అనుభవాన్ని రంగంలోకి దించి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. ఆరంభంలో వరుసగా లైఫ్‌లు దక్కించుకున్న రూట్.. తర్వాత బౌండరీలతో వేగం పెంచి 57 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. మరోవైపు జోర్డాన్ కాక్స్ కూడా ధాటిగా ఆడి అర్ధశతకం సాధించడంతో ఇంగ్లండ్ 25వ ఓవర్‌లోనే లక్ష్యాన్ని ఛేదించింది. రూట్ 62, కాక్స్ 59 పరుగులతో అజేయంగా నిలిచారు. అంతకుముందు పాకిస్థాన్ తరఫున అరంగేట్ర బౌలర్ రజాఉల్లా బ్యాట్‌తో సంచలనం సృష్టించి 81 పరుగులు చేయడం మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. అయినా తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలిన పాక్‌ను ఆ పోరాటం కాపాడలేకపోయింది. ఈ సిరీస్ విజయం ఇంగ్లండ్‌కు ఊరటనిస్తే.. పాకిస్థాన్ సంక్షోభాన్ని మరింత లోతుగా నెట్టింది. డబ్ల్యూటీసీలో ఇంగ్లండ్ ఆరో స్థానంలోనే ఉన్నా విజయ శాతం 38.54కి పెరిగింది.

# ఏషియన్ గేమ్స్‌లో షెడ్యూల్ ట్విస్ట్

## టీమిండియాకు కొత్త టైమింగ్! షెడ్యూల్ మార్పు

జపాన్‌లో జరగనున్న ఏషియన్ గేమ్స్ 2026లో టీమిండియా పోరుకు షెడ్యూల్ ట్విస్ట్ వచ్చింది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగనున్న భారత పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ సమయాన్ని 30 నిమిషాలు ముందుకు మార్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 28న జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మొదట స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్ణయించగా.. ఇప్పుడు 1:30 గంటలకే ప్రారంభం కానుంది. అంటే భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకే మ్యాచ్ మొదలవుతుంది. అక్టోబర్ 1 సెమీఫైనల్, అక్టోబర్ 3 ఫైనల్ సమయాల్లోనూ ఇదే మార్పు వర్తించనుంది. మిగతా మ్యాచ్‌లు మాత్రం షెడ్యూల్ ప్రకారమే సాగనున్నాయి. పురుషుల విభాగంలో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. మరోవైపు గ్రూప్ దశ నుంచి ఆఫ్ఘనిస్థాన్, జపాన్, నేపాల్ అలాగే హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ టాప్ 8 కోసం పోరాడనున్నాయి. అసలు మజా ఇక్కడే.. భారత్ - పాకిస్థాన్ హైఓల్టేజ్ పోరు క్వార్టర్స్‌లో ఉండదు. ఇరు జట్లు సెమీఫైనల్ లేదా ఫైనల్లో మాత్రమే ఢీకొనే అవకాశం ఉండటంతో టోర్నీపై ఉత్కంఠ మరింత పెరిగింది.



# బూమ్ బూమ్ బుమ్రాకు టఫ్ టాస్క్

## అఫ్గాన్‌తో పోరులో పేస్ మహారాజుకు పరీక్ష



ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్ -అఫ్గానిస్థాన్ టీ20 పోరుకు రంగం సిద్ధమైంది.. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించే పిచ్‌పై బౌలర్ల వ్యూహాలే మ్యాచ్ ఫలితాన్ని తేల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మాజీ బీసీసీఐ సెలెక్టర్ సరందీప్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. ముఖ్యంగా గాయం నుంచి తిరిగి వచ్చిన జస్ప్రీత్ బుమ్రాపై ఆయన కీలక అంచనా వేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ పేసర్లలో ఒకడైన బుమ్రా పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తోనే బరిలోకి దిగుతున్నా.. తొలి మ్యాచ్‌లోనే వరుస వికెట్లు పడగొట్టాలని ఆశించడం సరైంది కాదని చెప్పారు. గాయం తర్వాత రిథమ్ అందుకోవడానికి కొంత సమయం పట్టొచ్చన్నారు. అయితే బుమ్రా రాకతో భారత పేస్ దళానికి ఆత్మవిశ్వాసం భారీగా పెరుగుతుందని స్పష్టం చేశారు. హర్షిత్ రాణా గైర్హాజరుతో యశ్ ఠాకూర్‌కు వచ్చిన అవకాశం మరో ఆసక్తికర అంశం. మరోవైపు వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ స్పిన్ త్రయం ఎంపికైతే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బౌలింగ్ మార్పులు పెద్ద సవాలుగా మారనున్నాయి. పవర్‌ప్లేలో స్పిన్ వేయించాలా? డెత్ ఓవర్లలో బంతి ఎవరి చేతికి ఇవ్వాలి? అన్నదే అసలు గేమ్ ప్లాన్!

# సంజూ, వైభవ్, ఇషాన్

## ఎవరి వైపు అయ్యర్ మొగ్గు?



అఫ్గానిస్థాన్‌తో తొలి టీ20కి ముందు టీమిండియా టాప్ ఆర్డర్‌లో అసలు ట్విస్ట్ ఇదే. సంజూ శాంసన్‌నా? టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీనా? ఇషాన్ కిషన్‌నా? ముగ్గురూ తమదైన శైలిలో జట్టుకు మ్యాచ్ విన్నింగ్ సామర్థ్యం ఉన్నవాళ్లే కావడంతో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు తుది కూర్పు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లలో సంజూ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం, జింబాబ్వేతో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో వైభవ్ ఓపెనింగ్ చేయడం ఎంపికను మరింత ఆసక్తికరంగా మార్చింది. మరోవైపు ఇషాన్ కిషన్ శుక్రవారం ప్రాక్టీస్‌లో వెన్ను పట్టేయడంతో అతని ఫిట్‌నెస్‌పైనా కాసేపు ఉత్కంఠ నెలకొంది. అయితే చిన్నపాటి ఇబ్బందేనని, విశ్రాంతి తీసుకున్న తర్వాత అతను సిద్ధంగా ఉంటాడని శ్రేయస్ స్పష్టం చేశాడు. తనకు ఇది తలనొప్పి కాదని, జట్టులో ఇలాంటి నాణ్యమైన ఆప్షన్లు ఉండటం అదృష్టమని కెప్టెన్ చెప్పాడు. అవకాశం ఎవరికి వచ్చినా జట్టు ప్రయోజనమే ముఖ్యమని, బయట కూర్చున్న ఆటగాడికి కూడా నమ్మకం కల్పించడం తన బాధ్యత అని పేర్కొన్నాడు. దీంతో ఆదివారం ఢిల్లీలో జరిగే మ్యాచ్‌లో తుది జట్టులో ఎవరి పేరు మెరుస్తుందోనన్న ఆసక్తి అభిమానుల్లో పెరిగింది.



# డిఫరెంట్ గా ట్రై చేయడమే ఇష్టం

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

# 'ఆదర్శ కుటుంబం' టీజర్ అవుట్

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేసింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.





# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?

ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.





# జూనియర్ ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మెప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.